Follow: @ANNTELUGU
02-07-2025
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్   సంపుటి- 22   సంచిక- 208   పేజీలు-08   వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## చరణ్ ఫ్యాన్స్ దబిడిదిబిడి
- దిగొచ్చిన శిరీష్ రెడ్డి

02

## కొత్త రేషన్ కార్డులొస్తున్నాయ్
- 14న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- తుంగతుర్తి నుండే శ్రీకారం

02



## రాజీసింగ్
- హరీశ్ రావు నాకు ఫ్రెండ్..
- కిషన్ రెడ్డి వల్లే పవర్ రాలే
- హైకమాండ్ పిలిస్తే మొత్తం చెప్తా

02




## కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే
# తెలంగాణకు మరణశాసనం

### సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదు
మాకు రాగిసంకటి.. రొయ్యల పులుసు కాదు
తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం

తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2015లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మారణశాసనంగా మారాయన్నారు. నీటిపారుదల శాఖను పదేళ్లపాటు కేసీఆర్, హరీశ్ రావు చూశారని గుర్తు చేశారు. రాష్ట్ర నీటిహక్కులను వాళ్లు కాపాడతారని అందరూ భావించారని, ఇలా కాపాడతారని భావించినవాళ్లే రాష్ట్రానికి నష్టం చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గోదావరిబనకచర్లపై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.

- మహా, హైదరాబాద్

వివరాలు 3లో



## యమపాశ మైలారం
### ఘటనపై సీఎం రేవంత్ సీరియస్
### సిగాచి యాజమాన్యంపై ఆగ్రహం
ఒక్కో కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం
సిగాచి ఫ్యాక్టరీ ప్రమాద బాధితులను ఆదుకుంటాం
ప్రమాదంపై అత్యున్నత కమిటీతో విచారణ జరిపిస్తాం: రేవంత్
పేలుడు ఘటనాస్థలిని పరిశీలించిన ముఖ్యమంత్రి
సీఎంతో పాటు మంత్రులు, శ్రీధర్ బాబు, రాజనర్సింహ, వివేక్, పొంగులేటి

పాశమైలారం కెమికల్ కర్మాగారం.. యమపాశమైంది. పాశమైలారం పేలుడు ఘటనాస్థలిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పరిశ్రమలశాఖ అధికారులు, మంత్రులతో సమీక్షించారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో పరిశ్రమలశాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.

- మహా, సంగారెడ్డి

వివరాలు 3లో



## పాశమైలారం ఘటన
# దురదృష్టకరం
కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకరిస్తాం
కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

వివరాలు 2లో

## అంగట్లో ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు
### సైకిల్ స్టాండ్ అడ్డాగా బేరసారాలు
2 లక్షలు పలుకుతున్న ఆర్టీసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం
దళారుల మాటలకు మోసపోతున్న నిరుద్యోగులు
200 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల
ఔట్ సోర్సింగ్ కండక్టర్ ఉద్యోగం ఇస్తామంటూ ప్రకటనలు
ఎవరిని ఏజెంట్లుగా నియమించలేదన్న ఆర్.ఎం.. నమ్మి మోసపోవద్దు

**హన్మకొండ మహా;** ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఆయా ప్రభుత్వ శాఖలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తుంటారు. ఇది అదునుగా భావిస్తున్న కొంతమంది దళారులు రాజకీయ నాయకుల పేర్లను వాడుకుంటూ అధికారులను మభ్యపెడుతూ ఆశావాహులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామంటూ అందినకాడికి దోచుకోవడం పరిపాటిగా మారింది.

మిగతా 2లో



## నేను మీరనుకున్నంత సౌమ్యుడిని కాదు
### అబద్ధాలను ట్రోల్ చేస్తే తాటతీస్తా..
విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ 14 సార్లు జైలుకు వెళ్లా
గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరాలి
పార్టీలో పాత, కొత్త అనేదే ఉండదు
పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుంది
బీజేపీ కొత్త అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, మహా : బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ కేంద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేంద్రమంత్రి శోభాకరంద్లాజే ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. అనంతరం రాంచందర్‌రావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడిన ఆయన తొలి స్పీచ్‌లోనే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మిగతా 3లో

## ఏసీబీ దూకుడు
### 6 నెలల్లో 126 కేసులు
125 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్
ట్రాప్ చేసిన కేసుల్లో రూ. లక్షల్లో డబ్బు సీజ్
అక్రమార్కుల చిట్టా విప్పిన అవినీతి నిరోధక శాఖ
నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడి




**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఏసీబీ దూకుడు పెంచింది. అవినీతి అధికారులను కటకటాల పాలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో లంచాలు తీసుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వారే టార్గెట్ గా తనిఖీలు చేసిన అక్రమార్కులను అరెస్ట్ చేస్తున్నారు. తాజాగా, తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. మారుమూల ప్రాంతాల నుంచి కంప్లైంట్ వస్తే.. అక్కడికి వెళ్లి లంచగొడ్డిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని తగిన శిక్షలు విధిస్తున్నారు.

మిగతా 3లో

## బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ
వివరాలు 2లో

## పవన్ కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు!
- మురుగన్ సదస్సులో నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు
- తమిళనాడులోని అన్నానగర్ పీఎస్‌లో కేసు

03

# అంగట్లో ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు

## సైకిల్ స్టాండ్ అడ్డాగా బేరసారాలు

- 2 లక్షలు పలుకుతున్న ఆర్టీసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం
- దళారుల మాటలకు మోసపోతున్న నిరుద్యోగులు
- 200 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల
- ఔట్ సోర్సింగ్ కండక్టర్ ఉద్యోగం ఇస్తామంటూ ప్రకటనలు
- ఎవరిని ఏజెంట్లుగా నియమించలేదన్న ఆర్.ఎం.. నమ్మి మోసపోవద్దు



(మొదటిపేజీ తరువాయి)

జీవితంలో ఇక స్థిరపడతామని ఎన్నో ఆశ పెట్టుకున్నా నిరుద్యోగులు అటు మోసపోయి ఇటు అప్పుల పాలైన వారు ఎందరో ఉన్నారు. మరల ఇదే పరిస్థితి ప్రస్తుతం ఆర్టీసీ లో కండక్టర్లు, డ్రైవర్లు ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ విషయంలో నెలకొందనిపిస్తుంది. ఇటీవల ఆర్టీసీలో కండక్టర్ పోస్టులు ఔట్ సోర్సింగ్ విధానం పై తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించి ఔట్ సోర్సింగ్ 1 ఏజెంట్ల ద్వారా రిక్రూట్మెంట్ చేయమని బస్సు భవన్ నుండి రాష్ట్రంలోని అన్ని రీజియన్లకు సర్కులర్ జారీ చేయడం జరిగింది. దానిలో భాగంగా వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయానికి ఒక సర్క్యులర్ వచ్చింది. ఇదే అధనుగా దళారులు ప్రచార మాధ్యమాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెలరేగితున్నారు. కొంతమంది దళారులు ఒక్కో ఉద్యోగానికి 2లక్షలు డిమాండ్ చేస్తూ చరవాణిలో, ఆర్టిసి ప్రాంగాణం లోని సైకిల్ స్టాండ్ కేంద్రంగా బేరం నడిపిస్తున్నారు. ఏకంగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం- ఆర్టీసీ వరంగల్ ఆర్ ఎం విజయభాను**

నేటి వరకు ఏ ఒక్క ఏజెంట్ కి రిక్రూట్మెంట్ పర్మిషన్ ఇవ్వలేదని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి. విజయభాను తెలిపారు. ఏజెంట్లు నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో ముడుపులు డిమాండ్ చేస్తున్నారని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా నిరుద్యోగులు ఎవరు జారీ చేయలేదని, నిరుద్యోగుల నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అటువంటి వారి గుర్తించి తమ దృష్టికి తీసుకొని వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

**సైకిల్ స్టాండే అడ్డా..**

కాగా ఇప్పటికే బస్టాండ్లో అవుట్ గోయింగ్ పక్కన ఉన్న సైకిల్ స్టాండ్లో ఏజెంట్ ఉద్యోగ నియామకం కొరకు అప్లికేషన్లు తీసుకుంటున్నట్టు సమాచారం. అతని తో పాటు మరికొంత మంది హనుమకొండ బస్టాండ్ లో కాంట్రాక్ట్ ఏజెంట్లు ద్వారా ఉద్యోగం ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షన్నర నుండి రెండు లక్షలు డిమాండ్ చేయడమే కాకుండా మీ ఉద్యోగులు పరమినెంట్ కూడా అవుతాయంటూ కొంతమందికి బ్రోకర్లు నమ్మబలుకుతున్నారు. వీరితోపాటు మరికొంతమంది ఏజెంట్లు కూడా నిరుద్యోగుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీ మొత్తంలో ముడుపులకు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేకమంది నిరుద్యోగులు ఈ ఏజెంట్లకు బయోడేటా అప్లికేషన్ ఫామ్స్ సబ్మిట్ చేస్తున్నారని బయోడేటా అప్లికేషన్ ఫామ్ తో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఎస్ఎస్సి మెమో, క్యాస్ట్ సర్టిఫికెట్లతో పాటు పెద్ద మొత్తంలో ముడుపులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏజెంట్ల వల్ల ఆర్టీసీ కి ప్రజల్లో ఉన్న మంచి పేరు కాస్త పోయి చెడ్డ పేరు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ ఔట్సోర్సింగ్ విధానం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు ఆర్టీసీ యాజమాన్యానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని తక్షణమే పై అధికారులు స్పందించి నిరుద్యోగులను మోసం చేస్తున్న దళారుల పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఏజెంట్ ద్వారా కాకుండా ఆర్టీసీ యాజమాన్యంమే ఔట్సోర్సింగ్ ఉద్యోగ పోస్టులకు నేరుగా దరఖాస్తులు తీసుకోని భర్తీ చేయాలని ప్రజలు, నిరుద్యోగులు.. అటు ప్రభుత్వాన్ని, ఇటు ఉన్నత అధికారులను కోరుతున్నారు.

**రంగంలోకి ఇంటెలిజెన్స్**

ఉద్యోగాల పేరులో జరుగుతున్న వసూళ్ళదందాపై తెలుసుకున్న కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ రవీందర్ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఇది హన్మకొండలో సంచలనంగా మారింది.




## కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే

# తెలంగాణకు మరణశాసనం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2015లో కేసీఆర్ , హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మారణశాసనంగా మారాయన్నారు. నీటిపారుదల శాఖను పదేళ్లపాటు కేసీఆర్ , హరీశ్‌రావు చూశారని గుర్తు చేశారు. రాష్ట్ర నీటిహక్కులను వాళ్లు కాపాడతారని అందరూ భావించారని, ఇలా కాపాడతారని భావించినవాళ్లే రాష్ట్రానికి నష్టం చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గోదావరిబనకచర్లపై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయించారని అందులో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని 2015లో సంతకం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 68 శాతం జలాలు ఏపీకి కేటాయిస్తే అభ్యంతరం లేదని సంతకం చేశారని ధ్వజమెత్తారు. ఇలా సంతకాలు చేసి మన హక్కులను ఏపీకి ధారాదత్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2015లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మారణశాసనంగా మారిందన్నారు. కృష్ణా పరివాహకం ప్రాంతం పరంగా చూస్తే తెలంగాణకే ఎక్కువ నీటి వాటా దక్కాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కేటాయించిన 299 టీఎంసీలు కూడా వాడుకోలేని పరిస్థితి తెచ్చారని చింతించారు. ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో 299 టీఎంసీలు వాడుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రారంభించిన ప్రాజెక్టులను పదేళ్లపాటు పట్టించుకోలేదని ఆగ్రహించారు. ఏపీ మాత్రం పూర్తి చేసుకున్న ప్రాజెక్టులకు నీటిని తరలించుకుపోతోందని ఆందోళన చెందారు.

**కమిషన్ల కక్కుర్తితోనే కాళేశ్వరం**

'ఉమ్మడి ఏపీలో రూ.38 వేల కోట్లతో ప్రాణహితచేవెళ్లను చేపట్టారు. ప్రాణహితచేవెళ్లను పక్కన పెట్టి కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల చేపట్టారు. కమీషన్లకు కక్కుర్తి పడి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టుతో 168 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. ఇలా ఇన్ని టీఎంసీలు ఎత్తిపోసేందుకు రూ.7 వేల కోట్ల కరెంటు బిల్లు ఖర్చు అవుతోంది. ఎత్తిపోసిన 168 టీఎంసీలలో మళ్లీ 112 టీఎంసీలు వృథాగా కిందకు వదిలారు. చచ్చిన పార్టీని బతికించుకునేందుకు మళ్లీ జలాల సెంటిమెంట్‌ను ఎత్తుకున్నారు. ఏపీని బూచీగా చూపి పార్టీని పునరుజ్జీవం చేసుకునేందుకు ఫామ్‌హౌస్‌లో క్షుద్రపూజలు చేశారు.'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు.

**జగన్ దిగిపోయి, చంద్రబాబు రాగానే జలాల సెంటిమెంట్**

గోదావరిలో వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని కేసీఆర్ మాట్లాడారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కేటాయింపులు ఉన్న 968 టీఎంసీలు వాడుకోకుండా వృథాగా పోతున్నాయని ఎలా అంటారని ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేసి వాడుకుంటే ఇంకా మిగులు జలాలు ఎక్కడ ఉంటాయని ప్రశ్నల వర్షం కురిపించారు. మిగులు జలాలతోనే బనకచర్ల కట్టుకుంటున్నామని ఏపీ చెప్తోందని, కేసీఆర్ మాటలతోనే గోదావరి జలాలను కృష్ణాకు తరలించే ప్రయత్నాలను జగన్ చేపట్టారని ఆనాటి విషయాలు గుర్తు చేశారు. జగన్ సీఎంగా ఉన్నన్ని రోజులు ఏపీ ప్రాజెక్టుల గురించి కేసీఆర్ , హరీశ్‌రావు మాట్లాడలేదన్నారు. జగన్ దిగిపోయి, చంద్రబాబు రాగానే జలాల సెంటిమెంట్‌ను కేసీఆర్ రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పునరుజ్జీవనం కోసం ఏపీ సీఎంను, తెలంగాణ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ బద్నాం చేస్తుందని ఫైర్ అయ్యారు. గోదావరి నీటిని రాయలసీమకు తరలించేందుకు కేసీఆర్ కుట్ర చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగానే రోజా ఇంటికెళ్లి రాగి సంకటి, చేపల పులుసు తిని రాయలసీమను రత్నాల సీమ చేస్తానని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. మాకు రాగి సంకటి, చేపల పులుసు వద్దని.. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యమని తేల్చి చెప్పారు.

# యమపాశ మైలారం

## ఘటనపై సీఎం రేవంత్ సీరియస్

### సిగాచి యాజమాన్యంపై ఆగ్రహం

### ఒక్కో కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం

- సిగాచి ఫ్యాక్టరీ ప్రమాద బాధితులను ఆదుకుంటాం
- ప్రమాదంపై అత్యున్నత కమిటీతో విచారణ జరిపిస్తాం: రేవంత్
- పేలుడు ఘటనాస్థలిని పరిశీలించిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు మంత్రులు, శ్రీధర్ బాబు, రాజనర్సింహ, వివేక్, పొంగులేటి

**సంగారెడ్డి, మహా:** పాశమైలారం కెమికల్ కర్మాగారం.. యమపాశమైంది. పాశమైలారం పేలుడు ఘటనాస్థలిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పరిశ్రమలశాఖ అధికారులు, మంత్రులతో సమీక్షించారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో పరిశ్రమలశాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై నివేదిక కోసం నిపుణులను నియమించాలని సూచించారు. నిపుణులతో చర్చించిన తర్వాతే సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమా సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. ఇప్పటికే తనిఖీ చేసిన అధికారులతో కాకుండా కొత్త వారితో విచారణ జరిపించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గానీ తెలంగాణ రాష్ట్రంలో గానీ ఇంత భారీ ప్రమాదం జరగలేదని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మృతుల్ని తరలించడం, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడం వంటివి అధికారులు దగ్గరుండి మరీ చూసుకుంటున్నారన్నారు. ఈ ప్రమాదం చాలా మంది ప్రాణాలు బలిగొందని.. ప్రమాదం దురదృష్టకరమని ఆవేదన చెందారు.

**ప్రమాదంలో 36 మంది మృతి**

దుర్ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించామని, ప్రభుత్వ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ప్రమాదంలో మృతులు.. క్షతగాత్రులు బీహార్, ఒడిశా, మధ్య ప్రదేశ్, ఆంధ్ర, తెలంగాణకు చెందిన వారు ఉన్నారన్నారు. ఈ ప్రమాదంలో 36 మంది ప్రాణాలు కోల్పోగా.. 17 మంది మిస్ అయ్యారని తెలిపారు. ఇంకా మరికొంతమంది ఆచూకీ లభించడం లేదన్నారు. ప్రమాద సమయంలో 143 మంది కార్మికులు ఉన్నారని.. ప్రమాదం అనంతరం 53 మంది ఆచూకీ తెలిసిందని సీఎం పేర్కొన్నారు. ఇంకా కొంతమంది శిథిలాల కింద ఉన్నారా.. లేక భయంతో ఎక్కడికైనా వెళ్ళిపోయారా అన్నది తెలియాల్సి ఉందని వెల్లడించారు.



### కోటి రూపాయల పరిహారం

సిగాచి పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన మృతులకు కోటి రూపాయల పరిహారం అందిస్తామని సీఎం ప్రకటించారు. తీవ్ర గాయాలపాలైన వారికి, పని చేసుకోలేని స్థితిలో ఉన్న వారికి పది లక్షలు ఇస్తామన్నారు. స్వల్ప గాయాలు అయినవారికి ఐదు లక్షల రూపాయలు పరిహారం అందజేస్తామని తెలిపారు. క్షతగాత్రులకు వైద్య సహాయం ప్రభుత్వం, పరిశ్రమ వర్గాలు కలిసి అందిస్తామని చెప్పారు. ప్రమాదంపై ఒక కమిటీని వేసామని.. కమిటీ బాధ్యులను గుర్తించిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని సీఎం అన్నారు.



## పాశమైలారం ఘటన దురదృష్టకరం

- కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకరిస్తాం
- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

**సంగారెడ్డి, మహా:** పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన చాలా దురదృష్టకరమైన సంఘటన అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 48 మంది మృతదేహాలు సంఘటన స్థలంలో లభ్యమయ్యాయని చెప్పారు. ఇంకా 11 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందన్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంలో ఘటన స్థలాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు రా మెటీరియల్ అందిస్తుందన్నారు. గతంలో సైతం ఒక పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా 11 మంది చనిపోయారని గుర్తు చేశారు.

**అన్ని విధాల సహకరిస్తాం..**

ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి ఆయన సూచించారు. పరిశ్రమల్లో తనిఖీలు, లంచాల కోసం జరుగుతున్నాయా..? లేక నామ్‌కి వాస్తు ప్రకారం జరుగుతున్నాయా..? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పొట్ట కూటి కోసం వచ్చి.. ఇలా ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంతో 46 మంది చనిపోవటం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. సిగాచి సంస్థలకు మరో మూడు పరిశ్రమలు ఉన్నాయని.. వాటిని సైతం తనిఖీ చేయాలన్నారు. అలాగే పరిశ్రమల ప్రాంతంలో కచ్చితంగా అంబులెన్స్ ఉండే విధానం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకరిస్తామని స్పష్టం చేశారు.

# కొత్త రేషన్ కార్డులొస్తున్నాయ్

## 14న ప్రారంభించనున్న సీఎం.. తుంగతుర్తి నుండే శ్రీకారం

**హైదరాబాద్, మహా** తెలంగాణలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీపై ఎట్టకేలకు నిర్ణయం ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న తొలి ప్రజా ప్రయోజన నిర్ణయాల్లో ఇది ఒకటి. రేషన్ కార్డుల కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న అర్హులైన కుటుంబాలకు తీపి కబురు అందించింది ప్రభుత్వం. ఈ నెల 14న తుంగతుర్తి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తొలి విడతలో రెండు లక్షలకు పైగా లబ్ధిదారులకు కార్డులు అందజేయనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే అర్హుల జాబితాను తుది రూపంలో సిద్ధం చేయగా.. ఆయా దరఖాస్తులను అధికారులు పరిగణనలోకి తీసుకుని, వడపోత ప్రక్రియ పూర్తయిన అనంతరం జాబితాను ఖరారు చేశారు.

**అర్హులైన వారికి కార్డులు మంజూరు:**

రాష్ట్రంలో గత కొంత కాలంగా రేషన్ కార్డుల మంజూరు నిలిచిపోయిన నేపథ్యంలో.. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ అంశంపై దృష్టి సారించింది. దీనికి సంబంధించి ఒక కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసి.. కొత్త రేషన్ కార్డుల జారీ విధానం, అర్హత ప్రమాణాలను పునర్ నిర్ణయించేందుకు సూచనలు కోరింది. కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రజాపాలన కార్యక్రమాల్లో వచ్చిన దరఖాస్తులతోపాటు.. మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి కార్డులు మంజూరు చేయబోతున్నది.



## రామ్ చరణ్ ఫ్యాన్స్ దబిడిదిబిడి

### దిగొచ్చిన శిరీష్ రెడ్డి

**మహా:** గేమ్ ఛేంజర్ పై తరచూ నోరు పారేసుకుంటున్న దిల్ రాజు బ్రదర్స్ కు రామ్ చరణ్ ఫ్యాన్స్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచంలోని తొలి సినిమా ఫ్లాఫ్ అయినట్లు, దానికి తమ హీరో కారణమైనట్లు గత ఆరు మాసాలుగా కుళ్ళబొడుస్తున్నారని.. ఇంకోసారి గేమ్ ఛేంజర్ పేరెత్తితే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ దిల్ రాజు బ్రదర్ శిరీష్ రెడ్డికి, దిల్ రాజుకు ఫ్యాన్స్ బహిరంగలేఖ విడుదల చేస్తూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఏ బ్యానర్ చేయనంత డ్యామేజ్ ఉద్దేశపూర్వకంగా ప్రతీరోజూ చేస్తున్నారంటూ ఆగ్రహం ప్రదర్శించగా, తన వ్యాఖ్యలు నొప్పిస్తే క్షమించాలంటూ శిరీష్ ఓ లేఖ రిలీజ్ చేశారు. అయితే ఫ్యాన్స్ దీనికి శాంతించేలా లేరు. తమ్ముడికి దీని దెబ్బ గట్టిగానే తగిలేలా ఉంది.

# బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ

### అమ్మవారికి కళ్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించడం నా అదృష్టం

### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ




**హైదరాబాద్, మహా:** ప్రజల బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఆషాఢ మాసంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో బోనాల సందడి ఉంటుందని గుర్తు చేశారు. బోనం అంటే భోజనమని... గతంలో ఇక్కడ ఒక మహమ్మారి విభృంజిస్తున్న సమయంలో బోనాల సంస్కృతి వచ్చిందని... అది ఇక్కడి ప్రజల నమ్మకం అని మంత్రి చెప్పారు. హైదరాబాద్ మహా నగరంలో విపత్తు వచ్చి వందల మంది చనిపోతున్నప్పుడు బల్కంపేట ఎల్లమ్మ తల్లి రక్షణగా ఎందరో ప్రాణాలు కాపాడిందని గుర్తు చేశారు. బోనాల పండగ ఇక్కడి ప్రజలకు ఒక గొప్ప వేడుకగా మారిందన్నారు. ఈసారి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించి, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసిందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్నారని... అందుకోసం సకల ఏర్పాట్లు చేసినట్టు గుర్తు చేశారు. ఈరోజు బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగిందని... రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం తనకి రావడం చాలా అదృష్టంగా ఉందన్నారు. అమ్మవారి కళ్యాణం సందర్భంగా రాష్ట్రమంతా మంచి వర్షాలు పాడి పంటకు ఆరోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు మంత్రి సురేఖ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.



## రాజీసింగ్

- హరీశ్ రావు నాకు ఫ్రెండ్..
- కిషన్ రెడ్డి వల్లే పవర్ రాలే
- హైకమాండ్ పిలిస్తే మొత్తం చెప్తా

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తనకు మంచి మిత్రుడని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. అప్పుడప్పుడు ఆయనతో ఫోన్ మాట్లాడుతుంటానన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కిషన్ రెడ్డి వల్ల బీజేపీ అధికారంలోకి రావడం లేదని షాకింగ్ కామెంట్స్ చేశారు. కిషన్ రెడ్డి పార్టీని ఎదగనివ్వడం లేదన్నారు. అధిష్టానం పిలిస్తే కిషన్ రెడ్డిపై మొత్తం చెప్పేస్తానని బాంబ్ పేల్చారు. తనకు చివరి నిమిషంలో నామినేషన్ పత్రాలు ఇచ్చారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ వాళ్లు తనను తీసుకోరన్నారు. మహారాష్ట్ర నుంచి హిందూ పార్టీలు తనను ఆహ్వానిస్తున్నాయన్నారు. తన వెనుక ప్రజలు ఉన్నారన్నారు. కాగా హైకమాండ్ సీరియస్ కావడంతో రాజాసింగ్ రాజీసింగ్ గా మారినట్లుగా తెలుస్తోంది. టీకప్పులో తుఫాన్ లా రాజీనామా ఎపిసోడ్ ముగిసే సూచనలున్నాయి.

# నేను మీరనుకున్నంత సౌమ్యుడిని కాదు

## అబద్ధాలను ట్రోల్ చేస్తే తాట తీస్తా

### విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ 14 సార్లు జైలుకు వెళ్లా

గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరాలి.. పార్టీలో పాత, కొత్త అనేదే ఉండదు

పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుంది.. బీజేపీ కొత్త అధ్యక్షుడు రాంచందర్ రావు



(మొదటిపేజీ తరువాయి)

తాను అందరూ అనుకున్నట్లు సౌమ్యుడిని కాదని అన్నారు. క్యాంపస్‌లో చదువుతున్న రోజుల్లోనే 14 సార్లు జైలుకు పోయినట్లు చెప్పుకొచ్చారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసి లాఠీ దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీలో 'కొత్త', 'పాత' అనే భేదాలు లేవని స్పష్టం చేశారు. బిడ్డ పుట్టగానే కుటుంబ సభ్యులు అయినట్టు పార్టీలో చేరగానే వారంతా పార్టీ కుటుంబ సభ్యులే అని వ్యాఖ్యానించారు. తాను పేరుకే అధ్యక్షుడినని ఎప్పటికీ కార్యకర్తను, ప్రజల సేవకుడినేనని పేర్కొన్నారు. పార్టీ ఈ స్థాయికి ఎదిగిందంటే ఎంతో మంది కార్యకర్తల, నాయకుల త్యాగాలు, చెమట కష్టమే కారణమని కొనియాడారు. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాల వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగిందని, తాను కూడా నక్సలైట్ బాధితుడినేనని గుర్తుచేసుకున్నారు.

కలిసికట్టుగా గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాలని, యువకులు, మహిళలు బీజేపీలోకి రావాలని అన్నారు. తెలంగాణ ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వాట్సాప్ యూనివర్సిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్‌తో ట్రోలింగ్ చేస్తున్నాయని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను క్రిమినల్ లాయర్‌ను కాబట్టి ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని హెచ్చరించారు. రాంచందర్ రావు సౌమ్యుడు, మెతక మనిషే అయినా యుద్ధంలోకి దిగితే యోధుడినేనని అన్నారు. ఏబీవీపీలో ఉన్నప్పుడు జైలుకు వెళ్లి, పోలీసుల లాఠీ దెబ్బలు తిని, కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నా సిద్ధాంతాన్ని వీడకుండా పనిచేసిన అనుభవం తనకు ఉందని చెప్పారు. గతంలో విద్యార్థులు, న్యాయవాదులు, పేదల పక్షాన న్యాయ పోరాటం చేశానని ఇకపై తెలంగాణ ప్రజల పక్షాన అలుపెరగని పోరాటాలకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అందరితో కలిసి పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకొస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎంతోమంది కార్యకర్తలు, నేతల త్యాగాలతో భాజపా ఈ స్థాయిలో ఉందన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలని.. గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరాలన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ తదితరుల నాయకత్వంలో వారి సహకారంతో ముందుకెళ్తామన్నారు. 14 కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అని పేర్కొన్నారు. అలాంటి రాజకీయ పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడినయ్యా. తెలంగాణ అధ్యక్షుడిగా నన్ను ప్రకటించడం గర్వంగా భావిస్తున్నా. కార్యకర్తగానే పనిచేస్తా. పార్టీలో నాయకులంతా సమష్టిగా పనిచేస్తారు. కొత్తపాత తేడా లేదు.. ఎవరైనా భాజపాలో చేరినప్పటి నుంచే పార్టీ వ్యక్తులు. కొత్తనీరు రావాలి. యువత, మహిళలు భాజపాలో చేరాలి, పార్టీని బలపరచాలన్నారు.

ప్రజాస్వామ్య, వికసిత్ తెలంగాణకు భాజపా అధికారంలోకి రావాలి. ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. ప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటం చేస్తాను. తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. ప్రజలు, కార్యకర్తలు, నేతలు కలిసి రావాలని రామచందర్‌రావు అన్నారు. బీజేపీలో కొత్త, పాత అనే పంచాయతీ లేదని నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందేనన్నారు. బీజేపీ మాస్ క్యాడర్ పార్టీ అని సిద్ధాంత బలమున్న పార్టీ అన్నారు. తెలంగాణ ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని, పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ వర్సిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్ ను ట్రోలింగ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు దమ్ముంటే నేరుగా పోరాడదాం రండి అని సవాల్ విసిరారు.

**పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం**
**- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు**

కొత్త అధ్యక్షుడి ఎన్నిక విషయంలో పార్టీ అంతర్గత అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బీజేపీలో పదవులు ముఖ్యం కాదన్నారు. "రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా ఫర్వాలేదు. మన పార్టీకి కార్యకర్తలే నిజమైన నాయకులు, వాళ్లే మన బలం. నాయకత్వంలో ఎవరున్నా అందరూ ఐక్యంగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు. రామచందర్‌రావు నాయకత్వంలో నేతలంతా కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అందరూ సమష్టిగా పని చేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమీ చేయడం లేదని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ నిజాన్ని విమర్శకులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం తామేనని, రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

**మేం తెలంగాణ ప్రజలతో కుమ్మక్కయ్యాం**

బీజేపీపై విమర్శలు చేస్తున్న వారికి జవాబు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీబీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ అంటుంటే, కాంగ్రెస్ బీఆర్ఎస్ కుమ్మక్కు అయ్యాయని బీఆర్ఎస్ ప్రతిరోజు విమర్శలు చేస్తున్నారంటూ మాకు ఎవరితోనూ కుమ్మక్కు అయ్యే అవసరం లేదన్నారు. మేము కుమ్మక్కు అయ్యేది తెలంగాణ ప్రజలతో మాత్రమేనన్నారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, కేసీఆర్ ఎవరి దయాదాక్షిణ్యాలతో మేము గెలవలేదని, మా కార్యకర్తల కష్టం, తెలంగాణ ప్రజల ఆశీస్సులతో మాత్రమే గెలిచామన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ముందుకు వెళ్తామన్నారు. బీజేపీపై అర్థం పర్థం లేకుండా రన్నింగ్ కామెంట్స్ చేస్తున్న సన్నాసులకు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదని, సమాధానం చెప్పుకునే అవసరం ఎవరికైనా ఉంది అంటే అది నా తెలంగాణ ప్రజలకు మాత్రమేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలకు అండగా నిలిచి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మా పార్టీ అధ్యక్షుడు ఎవరు ఉండాలో మా పార్టీ, మా కార్యకర్తలు నిర్ణయిస్తారు. కానీ మా పార్టీ అధ్యక్షుడి నియామకంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ మాట్లాడుతున్నారు. మా ముందు మీ పార్టీల సంగతి చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కాళ్ల కింద భూమి కదులుతోందన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారు ఇప్పుడు పోటీ పడి రాష్ట్రాన్ని దోచుకుంటున్న వాళ్లు బీజేపీకి అధ్యక్షుడు ఎవరు ఉండాలో చెప్తారా? మాకు నీతి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు అర్థం చేసుకోవాలన్నారు.

**ఆ పార్టీల ట్రాప్ లో పడకండి**

బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ట్రాప్‌లో పడొద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పార్టీ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన రాంచందర్ రావు ఓ మిస్సైల్ లాంటి వ్యక్తి అని కొనియాడారు. మొదటి నుంచి పార్టీకి ఆయన నిస్వార్థంగా సేవ చేశారని గుర్తు చేశారు. విద్యార్థి నాయకుడిగా, పార్టీ లీగల్ అడ్వైజర్‌గా, ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవలు ఎవరూ మరువలేరన్నారు. పార్టీలో అధ్యక్ష పదవిని ఎవరైనా ఆశించవచ్చని, కానీ, అధిష్టానం నిర్ణయాన్ని కూడా పాటించాల్సిందేనని అన్నారు. రాబోయే రోజుల్లో రాంచందర్‌రావు నాయకత్వంలో అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తమ పార్టీని ట్రోల్ చేసినోళ్లు కాలగర్భంలో కలిసిపోయారని కామెంట్ చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ట్రాప్‌లో పడొద్దని అన్నారు. భారతీయ జనతా పార్టీలో ఎలాంటి గ్రూపులు ఉండవని.. తమ కెప్టెన్ నరేంద్ర మోడీనే అని బండి సంజయ్ అన్నారు.

**మా సత్తా ఏంటో చూపిస్తాం: ఎంపీ లక్ష్మణ్**

రాంచందర్ రావు ఆర్ఎస్ఎస్‌లో శిక్షణ పొంది, విద్యార్థి పరిషత్ నాయకుడిగా ఉస్మానియా యూనివర్సిటీలో నాయకత్వం వహిస్తూ, బీజేపీలో గత 40 ఏళ్లుగా పనిచేస్తున్న ఓ నిజమైన కార్యకర్త అని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ఇది ఒక కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావించాలన్నారు. బీజేపీలో నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ కోసం నిరంతరం కష్టపడిన నాయకులకే పెద్ద పదవులు లభిస్తాయి. దానికి రాంచందర్ రావు మరో ఉదాహరణ అని అన్నారు. రాంచందర్ రావు సీనియర్ అడ్వకేట్. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో అనేక కేసులు వాదించారు. జాతీయ స్థాయిలో బీజేపీ లీగల్ సెల్ కోకన్వీనర్‌గా కూడా పనిచేశారు. తాను రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి కేవలం 200 ఓట్ల తేడాతో ఓడినప్పుడు, ఎంతోమంది ఎన్నికల పిటిషన్ వేయమన్నారు. అప్పుడు నేను ఆ బాధ్యతను రాంచందర్ రావుకే అప్పగించాను. చాలామంది అడ్వకేట్లు ఆశ్చర్యపడ్డారు, రాంచందర్ రావు క్రిమినల్ లాయర్, మరి సివిల్ పిటిషన్ ఎలా వాదిస్తారని కానీ రాంచందర్ రావు వాదించి చూపించారని లక్ష్మణ్ అన్నారు. తెలంగాణలో రాంచందర్ రావు నాయకత్వంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఇక నుంచి తామేంటో, తమ పార్టీ సత్తా ఏంటో రాబోయే ప్రతీ ఎన్నికల్లో చూపిస్తామని లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాంచందర్ రావు నాయకత్వంలో అందరం కలిసి పని చేయాలన్నారు. భగవంతుడు ఆయన్ను ఆయురారోగ్యాలతో ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే క్రమంలో మనమంతా ఆయనకు అందరం అండగా నిలబడుతామని లక్ష్మణ్ అన్నారు.

### ఈటల ఎంట్రీ.. నినాదాలతో మారు మ్రోగిన హాల్

రాంచందర్ రావు ఎన్నిక ప్రకటన సభ నేపథ్యంలో వేద కన్వెన్షన్ లో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఎంపీ ఈటల రాజేందర్ వస్తున్న సమయంలో బీజేపీ శ్రేణులు సందడి చేశాయి. జై ఈటల, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో వేద కన్వెన్షన్ మారు మ్రోగిపోయింది. అనంతరం కార్యక్రమంలో ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుకి శుభాకాంక్షలు తెలియజేశారు. రాంచందర్‌రావు నాకంటే చాలా పెద్దవారు కానీ.. నాకు ఆయనకు చాలా రోజుల నుంచి మంచి స్నేహం ఉందన్నారు. మా అన్నతో పాటు వెళ్ళినప్పుడల్లా ఆయనని కలిసేవాన్ని అని తెలిపారు. చదువుకునేటప్పుడు కూడా విద్యార్థి సంఘాల్లో పనిచేశాము.. 35 ఏళ్లుగా ఆయన్ను దగ్గర నుంచి చూసాము. సౌమ్యుడు, కమిట్ మెంట్ ఉన్న కార్యకర్త అని కొనియాడారు. అనేక విషయాల పట్ల సంపూర్ణ అవగాహన ఉన్న నాయకుడు అని, నేను మంత్రిగా ఉన్నప్పుడు బీజేపీ నుంచి ఒక్కరే ఎమ్మెల్సీగా ఉన్నా ఆయన నిర్వహించిన పాత్ర ఎంత గొప్పగా ఉందో అని అనేకసార్లు ప్రశంసించామన్నారు. కార్యకర్తల నమ్మకాన్ని నడిపించడంలో తప్పకుండా ముందు భాగంలో ఉంటారని మేమందరము సంపూర్ణ సహకారం అందిస్తామని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏసీబీ దూకుడు

## 6 నెలల్లో 126 కేసులు

(మొదటిపేజీ తరువాయి)

జనవరి నుంచి జూన్ వరకు కేవలం 6 నెలల్లో 126 కేసులు నమోదు చేసింది ఏసీబీ. జూన్ నెలలో 31 కేసులు నమోదు కాగా, అందులో 15 ట్రాప్, 2 అక్రమాస్తుల కేసు, 3 క్రిమినల్ దుష్ప్రవర్తన, 4 రెగ్యులర్ కేసులు, 7 ఆకస్మిక తనిఖీల కేసులు ఉన్నాయి. ఏసీబీ కేసుల్లో అరెస్ట్ అయిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు.

**జ్యుడీషియల్ రిమాండ్‌కు నిందితులు..**

పట్టుబడ్డ నిందితులు జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారు. ఏసీబీ ట్రాప్ కేసులో 3.43 లక్షల రూపాయల డబ్బు సీజ్ చేయగా.. రెండు అక్రమ ఆస్తుల కేసులో 13.50 లక్షల ఆస్తులు, 5.22 లక్షల ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆర్టీఏ, సబ్ రిజిష్టర్ తనిఖీల్లో లెక్క చూపని రూ. 2.72 లక్షలు సీజ్ చేశారు ఏసీబీ అధికారులు. 6 నెలల్లో 80 ట్రాప్ కేసులు, 8 అక్రమాస్తుల కేసులు, 14 క్రిమినల్ దుష్ప్రవర్తన, 10 రెగ్యులర్ ఎంక్వైరీలు, 11 ఆకస్మిక తనిఖీలు ఉన్నాయి. ఇందులో 8 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సహా 125 మంది ప్రభుత్వ ఉద్యోగులను ట్రాప్ చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ ట్రాప్ కేసుల్లో 24.57 లక్షల మొత్తం స్వాధీనం చేసుకోగా.. డీఏ కేసులలో 27.66 లక్షల విలువైన ఆస్తులను వెలికి తీశారు.. ఆర్టీఏలో జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

# పవన్ కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు!

### మురుగన్ సదస్సులో నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు

### తమిళనాడులోని అన్నానగర్ పీఎస్‌లో కేసు



**తమిళనాడు, మహా:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు బిగ్‌షాక్ తగిలింది. తమిళనాడులోని అన్నానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. జూన్ 22న మధురైలో జరిగిన మురుగన్ భక్తుల సదస్సులో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిబంధనలు ఉల్లంఘించారన్న అభియోగాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. పవన్‌తో పాటు తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలైపై కూడా కేసు నమోదైంది.

**ద్వేషపూరిత ప్రసంగాలు చేశారంటూ..**

అదే సమయంలో ద్వేషపూరిత ప్రసంగాలు చేసి, మత విద్వేషాలను ఉద్రిక్తతను రెచ్చగొట్టారని ఆరోపిస్తూ పవన్ కళ్యాణ్, అన్నామలై తో పాటు అనేక మంది నిర్వాహకులపై కేసు నమోదైంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం... మధురై పీపుల్స్ ఫెడరేషన్ ఫర్ కమ్యూనల్ హార్మనీకి చెందిన న్యాయవాది వంజినాథన్ ఫిర్యాదు ఆధారంగా అన్నానగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు ధృవీకరించారు. ఈ క్రమంలో వీరిపై భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 196(1)(ఏ), 299, 302, 353(1)(బి)(2) ల కింద కేసు నమోదు చేశారు.

# ఎఎన్ఎన్ అద్భుతంగా పురోగమించాలి

### అదృష్ట రత్న సిద్ధాంతి డాక్టర్ రమణ యోగి లాల్ జీ



**హైదరాబాద్ సిటీ, మహా** ఎఎన్ఎన్ ఛానల్ అద్భుతంగా పురోగమించాలని అదృష్ట రత్న సిద్ధాంతి, ప్రఖ్యాత సర్వమంత్ర ఉపాసక పండితుడు డాక్టర్ రమణ యోగి లాల్ జీ అన్నారు. మంగళవారం ఎఎన్ఎన్ ఛానల్ కు వచ్చిన ఆయన ఆన్ లైన్ జర్నలిజం స్కూల్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఎఎన్ఎన్ ఛానల్ , మహా పత్రిక తెలుగు నాట అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకుంటున్నాయని, ఇంకా మరింతగా పురోగమించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఈవో రామచంద్రారెడ్డి, జర్నలిజం స్కూల్ ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి, డిజిటల్ హెడ్ కె.రాకేష్, జీఎం అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

# వెంకయ్యనాయుడు ఇంట్లో లేవ లేకుండా అయ్యిండు!

- **ఇంకో నాలుగేళ్లు అయితే చంద్రబాబు పరిస్థితి అదే**
- **బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా:** భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిపై బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణలో చాలా వరకు వెంకయ్యనాయుడు, చంద్రబాబుకు సంబంధించిన ఛానల్సే ఉన్నాయి. అందుకే ఇలాంటి కథనాలు వేస్తున్నారు. ఇలాంటి న్యూస్‌లను ప్రజలు నమ్మరు. ప్రస్తుతం వెంకయ్య నాయుడు ఇంట్లో లేవ లేకుండా అయ్యిండు.. ఇంకో నాలుగేళ్లు అయితే చంద్రబాబు నాయుడు కూడా లేవడు' అని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. అయితే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎన్నికలో చంద్రబాబు పాత్ర ఉందని, చంద్రబాబు మనిషి కాబట్టే రాంచందర్‌కు అవకాశం ఇచ్చారని పలు మీడియా ఛానళ్లలో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ కథనాలపై స్పందిస్తూ రాకేష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# హాస్టల్స్ విజిట్ క్యాలెండర్ రూపొందించండి

- అద్దె భవనాల్లో వసతులపై సమీక్షించండి
- సంక్షేమ విద్యార్థుల హెల్త్ రికార్డ్ రూపొందించండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా :** సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల పర్యటన, సమీక్షపై పకడ్బందీ క్యాలెండర్ రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజాభవన్ లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ అధికారి, ఏ రోజు పర్యటించారు.. వారు పరిశీలించిన అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ పర్యటన కార్యక్రమం నిరంతరం సాగాలని, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలను సైతం పర్యటనకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పెంచిన 40 శాతం డైట్, 200% కాస్మోటిక్ ఛార్జీలను పెంచి, డాక్టర్ల సూచన మేరకు పకడ్బందీ మెనూ ఖరారు చేసాం. ఈమెనూ అన్ని సంక్షేమ హాస్టల్లో, గురుకులాల్లో ప్రముఖంగా కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. వసతి గృహాల అదే భవనాల్లో వసతులు ఎలా ఉన్నాయి, భవనాలు, యజమానుల వివరాల తో ఒక నివేదిక రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. అన్ని వసతి గృహాల్లో దోమతెరలు ఏర్పాటు చేయాలి, రన్నింగ్ వాటర్ సప్లై లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఉన్న విద్యార్థులందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డు లు రూపొందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారులను సమన్వయం చేసుకొని హెల్త్ కార్డు లు రూపొందించే కార్యక్రమం వేయంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఏదైనా అనారోగ్యం ఏర్పడితే ఆన్లైన్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయని వారి సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

# నేషనల్ స్పోర్ట్స్ పాలసీకి గ్రీన్‌సిగ్నల్

### కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర క్యాబినెట్

- **ఈఎల్ఐ పథకానికి రూ.1.07 లక్షల కోట్లు కేటాయింపు**
- **ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి కేంద్రం ఆమోదం**
- **క్యాబినెట్ వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**




**ఢిల్లీ, మహా:** కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.3 లక్షల కోట్లకు పైగా విలువ చేసే పలు కీలక పథకాలకు ఆమోదం తెలిపింది. వీటిలో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్, పరిశోధనఅభివృద్ధిఆవిష్కరణ, జాతీయ క్రీడా విధానం 2025, తమిళనాడులో కీలక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టు ఉన్నాయి. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిశోధానాభివృద్ధి, ఆవిష్కరణ రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా రీసెర్చ్ డవలప్‌మెంట్ అండ్ ఇన్నొవేషన్ పథకానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.1 లక్ష కోట్లు కేటాయించింది. ఇజ్రాయెల్, యూఎస్, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన గ్లోబల్ మోడల్‌స్‌ను అధ్యయనం చేసి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ రూపొందించిన అంతర్జాతీయ రోడ్‌మ్యాప్ ఆధారంగా ఈ స్కీమ్ ఉంటుంది. ప్రైవేటు రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్టు తెలిపింది. ఈ పథకం కింద ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ, వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ అందించనున్నారు.

**ఈఎల్ఐ పథకానికి రూ.1.07 లక్షల కోట్లు..**

మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1.07 లక్షల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇది మ్యాన్యుఫ్యాక్చరింగ్‌డ్రైవెన్ ఎకానమీకి కీలక గ్రోత్ ఇంజన్ అని గత బడ్జెట్‌లో వైష్ణవ్ ప్రకటించారు. గత దశబ్దా కాలంలో భారతదేశం క్రీడారంగంలో సాధిస్తున్న వృద్ధిని దృష్టిలో ఉంచుకుని జాతీయ క్రీడా విధానం2025కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లడం, కోచింగ్ అవకాశాలు మెరుగుపరచడం, దేశంలోని క్రీడా సదుపాయాలను పటిష్టం చేయడం వంటికి ఈ పథకం ప్రధాన ఉద్దేశాలు.

**రూ.1,853 కోట్లతో నాలుగు లేన్ల నేషనల్ హైవే..**

దక్షిణ భారతదేశంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంలో భాగంగా తమిళనాడులోని పరమకుడిరామనాథపురం సెక్షన్ల మధ్య నాలుగు లేన్ల నేషనల్ హైవే విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 46.7 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,853 కోట్లు వ్యయం చేయనుంది.



# మళ్లీ అవే పాత అబద్ధాలు

- **సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్**

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో కాంగ్రెస్‌ను మొద్దునిద్ర లేపింది బీఆర్ఎస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తిరస్కరించే వరకు అలుపెరగని పోరాటం చేసింది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు చాలు అని చెప్పిన రేవంత్‌కు.. మిగులు జలాల్లోనూ తెలంగాణకు వాటా ఉంటుందని జ్ఞానోదయం చేసింది తామే అని అన్నారు. మళ్లీ అవే పాత అబద్ధాలు ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికీ ఎందుకు డిమాండ్ చేయవు? అని ప్రశ్నించారు. చంద్రబాబు పట్ల నువ్వు చూపుతున్న గురుభక్తికి ఇది నిదర్శనం కాదా? హరీశ్ రావు నిలదీశారు. జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం, సీడబ్ల్యూసీ అనుమతి పొందకుండా ఈఏసీ అనుమతి ఇవ్వదని చెప్పారు. ఏపీ అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి వెళ్లేకంటే ముందే అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలనే సోయి కూడా లేదు నీకు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

EDITORIAL సంపాదకీయం

# కలం గళంగా మారిన విప్లవ యోధుడు

## విప్లవ కవిత్వానికి జీవనరేఖ చెరబండ రాజు



**ప్రస్తావన**

తెలుగు విప్లవ సాహిత్యంలో మచెరబండ రాజు. హాకవి శ్రీశ్రీ ప్రస్థానం అనేది ఒక మధురమైన ఉద్యమాత్మక ప్రయాణం. అయితే ఈ ప్రయాణంలో అయనకే స్ఫూర్తి ని ఇచ్చిన వారు ఉద్యమశీలి, ప్రజాశ్రయ కవి చెరబండ రాజు. శ్రీ శ్రీ మరో ప్రస్థానం అనే రచనను చెరబండకీ అంకితం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత గౌరవ నివేదిక కాదు, ఉద్యమాత్మక సాహిత్యానికి, ప్రజల పక్షాన సాగిన సమీక్షా బాటకు సమర్పణ.

చెరబండ రాజు - దిగంబర భావ చైతన్యానికి ప్రతినిధి

తెలుగు సాహిత్యంలో విప్లవిక భావధారలకు జీవరేఖగా నిలిచిన కొద్దిమంది కవుల్లో చెరబండ రాజు పేరు అగ్రగణ్యమైనది. నల్గొండ జిల్లా అంకుశాపురం గ్రామంలో ఒక పేద రైతు కుటుంబంలో జన్మించారు చెరబండరాజు.తన కవిత్వం గురించి చెబుతూ చెరబండ...

**వంచనల సంకుచిత సహజీవనాల్లో**
**కుంచించుకు పోయి జాతి మతాల**
**నెమరువేసే యుగాల రోగ పీడుతుల్ని**
**పండితుల్ని పశువుల్ని నంపుసక భావకుల్ని**
**నా కవితలు నా మనుష్య**
**ప్రపంచంలోకీ నడిపిస్తాయి**

ఇంకా చెబుతారు.....

**కలం గళం ప్రాణపదం**
**ప్రజ కీ నేను అంకితం**
**పోరాటం డైరెక్షన్**
**పాట నాకు ఆక్సిజన్**

**'దిగంబర కవిత్వం' – నిర్వచన విశ్లేషణ**

'దిగంబర కవిత్వం' అనగా అలంకారాల ముసుగులను విడిచి, నిజమైన ప్రజా జీవనాన్ని నిర్వికారంగా ,నిర్భయంగా,నిర్వేణిగా చిత్రించే కవిత్వం. ఇందులో భాష ముస్తాబుకాదు; బలమైనది. భావం మధురంకాదు; ఘర్షణాత్మకం. విప్లవ కవిత్వానికి ఇది శబ్దశక్తిగా మారింది. (గూడెం మల్లేశం, "తెలంగాణ దిగంబర కవిత్వ పరంపర", తెలంగాణ సాహిత్య పరిశోధన గ్రంథం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2015)

**కొండలు పగలేసినం**
**కొండలు పగిలేసినం బండలనూ పిండినం**
**మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు గట్టినం**
**శ్రమ ఎవడిదిరో..సిరి ఎవడిదిరో**

**బంజర్లను నరికినం పొలాలనూ దున్నినం**
**మా చెమటలు ఏరులుగా**
**పంటలు పండించినం**
**గింజెవడిదిరో...గంజెవడిదిరో..!**

**మగ్గాలను పెట్టినం**
**పోగు పోగు వడికినం**
**మా నరాలె దారాలు గా గుడ్డలెన్నొ నేసినం**
**ఉడుకెవడిదిరో.. వణుకెవడిదిరో..!**

**యంత్రాలను తిప్పినం ఉత్పత్తులు పెంచినం**
**మా శక్తే విద్యుత్తుగ ఫ్యాక్టరీలు నడిపినం**
**మేడెవడిదిరో.. గుడిసెవడిదిరో..!**

**కారణాలు తెలిసినం**
**ఆయుధాలు పట్టినం**
**మా యుద్ధం ఆపకుండ విప్లవాలు నడిపెదం**
**చావు మీదిరో...*గెలుపు మాదిరో.!**

" కొండలు పగలేసినం కవితలో కవి శ్రమజీవుల యోగక్షేమాన్ని నినాదంగా మార్చారు. "మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు గట్టినం" ఇది కేవలం ఒక రాజకీయ వాక్యం కాదు. శ్రమకే నిర్మాణ హక్కు ఉన్నదన్న దృక్పథం. శ్రమిస్తే శ్రేయస్సు రావాలన్న సామాజిక తత్వాన్ని బలంగా ప్రతిబింబిస్తుంది. మా నరాలె దారాలుగా గుడ్డలెన్నో నేసినం" ఇక్కడ 'నరాల' అనే పదం జీవ శక్తికి, త్యాగానికి సంకేతం. ఇది కేవలం చర్మపు శ్రమ కాదు, నరాల్లో నరాల్లో నుండి జాలువారే జీవచైతన్యం.

**దిగంబర కవిత్వమూ – విప్లవ స్వరమూ**

1975 నాటికీ భారత దేశ రాజకీయ-ఆర్థిక స్థితిగతులు సంక్షోభంలోకి జారిపోయినవి . ఇందిరా గాంధీ అధికారంలో అత్యధిక స్థాయి అధికార పరిపాలన కే కేంద్ర బిందువుగా మారిన ఆ రోజుల్లో ఎమర్జెన్సీ విధానాలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పై గడ్డ రాగా విరుచుకుపడ్డాయి. అనేకమంది రచయితలు, సామాజిక విమర్శకులు నిరాశతో మూలకు చేరిన వేళ, కొందరు మాత్రం స్పందనగా శబ్దమయ్యారు. అందులో మొదటి వరుసలో నిలిచినవారు చెరబండ రాజు. అలాంటి పరిస్థితులను దిగంబర కవి చెరబండ నిరసిస్తూ......

**ఓ నా ప్రియమైన మాతృదేశమా**
**తల్లివి, తండ్రివి, దైవానివి నీవేనమ్మా**
**దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది**
**అంతర్జాతీయ విపణిలో**
**అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది**
**సంపన్నుల చేతుల్లో మైమరచి**
**నిద్రిస్తున్న యవ్వనం నీది**
**ఊసినా దుమ్మెత్తి పోసినా చలనం లేని మైకం నీది**

**కోతకొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న ఎలకల్నీ**
**పందికొక్కుల్నీ భరిస్తూ నించున్న**
**"భారతీ"వమ్మా**
**నోటికందని సస్యశ్యామల సీమవమ్మా..**

**ఒంటి మీద గుడ్డలతో జండాలు కుట్టించి**
**వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం నీది**
**అప్పు తెచ్చి వేసిన మిద్దెల్లో**
**కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది**
**ఎండిన స్తనాల మీదికి ఎగబడ్డ బిడ్డల్ని**
**ఓదార్చలేని శోకం నీది**
**ఆకలికి ఎండి మాడి ఎరువు సొమ్ములతో**
**వీధిన బడ్డ సింగారం నీది**
**అమ్మా భారతీ నీ గమ్యం ఏమిటి తల్లీ..!?**

అంటూ భాధ పడ్డ కవి చెరబండ.ఇలాంటి దుస్థితిని ఎదురించలేని పరిస్థితుల పట్ల ; స్వార్థ రాజకీయాలకు లొంగే మనుష్యుల పట్ల ఆగ్రహం ప్రకటించారు.

**ఏ సరిహద్దుల శాసనసర్పాలు**
**నీ పాదాల్ని బంధిస్తున్నాయ్**
**ఏ శిఖండి ప్రభుత్వాలు**
**నీ చేతుల్ని వంచిస్తున్నాయ్**
**ఏ భయసముద్ర తిమింగలాలు**
**నీ శాంతి నౌకల్ని మింగేస్తున్నాయ్**
**ధన లోభానికి పురుగులు మేసే**
**ఏ వార్తాపత్రికలు**
**నీ రక్తాక్షరాల్ని విరిచేస్తున్నాయ్**
**కన్నీళ్ళైనా .....పెట్టుకునేది**
**నీలో నీ తరంలో ఇంకేమీ లేదా.!?**

అంటూ ప్రశ్నిస్తూ అటూ దిగంబర కవిగా ఇటూ విప్లవ కవి గా ఎన్నో చర్చనీయ కవిత్వం రాసిన కవి వీరు. ఇతని గళమే "దిగంబర కవిత్వం" అనే విప్లవ భావ ప్రబంధానికి మూల ధ్వని.చెరబండ రాజు రాసిన కవితలో 'భారతీ' మాతృదేశ ప్రతిరూపం ఒక జీవ శీలత కలిగిన శరీరంగా రూపుదిద్దుకుంది. తన శీలాన్ని పోగొట్టుకున్న, శ్రమను తాకట్టు పెట్టిన, మైకంలో పడిపోయిన మహిళా రూపంగా 'దేశం'ను చిత్రించడంలో ఒక వైవిధ్యం ఉంది."ఓ నా ప్రియమైన మాతృదేశమా..." అని ప్రారంభించిన ఈ కవితలో, దేశాన్ని కన్న తల్లి కన్నా ఎక్కువ ప్రేమించాల్సినదిగా కవి భావిస్తారు. కానీ అదే తల్లి శీలాన్ని దుండగులు లాఠీలు పట్టుకుని కాల్చేస్తున్నారు.ఈ కవితలో కనిపించే ప్రతీ శబ్దం అంగాంగం తాకట్టు పెట్టిన అందం, వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం, ఎండిన స్తనాల మీదకి ఎగబడ్డ బిడ్డలు ఇవన్నీ రాజకీయంగా కాకుండా, శాస్త్రీయంగా, సామాజిక వాస్తవాలను ప్రతిబింబించే శిల్పాలు. (పాటిబండ్ల యాదయ్య, "శోకం నుండి పోరాటం వైపు: దిగంబర సాహిత్యంలో శరీర రూపకాల విశ్లేషణ", జనచైతన్యం మాసపత్రిక, 2002, హైదరాబాద్) కవిత చివరలో కవి ప్రశ్నించగల శక్తిగా మారతాడు."ఏ సరిహద్దుల శాసనసర్పాలు..."

"నీ శాంతి నౌకల్ని మింగేస్తున్న తిమింగలాలు..." ఇవి ఊహాప్రతీకలు కాదు - ఇవి స్పష్టమైన విమర్శా సంకేతాలు. శాసనసర్పాలు అంటే రాజ్యాంగాన్ని తక్కువ చేసి, ప్రజల గళాలను మింగిన విధాన నెపథ్యాలు; శాంతి నౌకలు అంటే అభివృద్ధి భావనలపై కొట్టిన సంక్షోభ తరంగాలు. ఇది పూర్తిగా విప్లవ భావ తత్వానికి మానవీయ రూపకల్పన.

**చెరబండ రాజు కవిత్వం**

చెరబండ రాజు రచించిన కవితా సంకలనాలు వివిధ దశల్లో ప్రజాస్వామ్య వ్యతిరేక వ్యవస్థల పట్ల నిషేధ భావాన్ని నిక్షిప్తం చేశాయి. వాటిని చూస్తే దిక్సూచి (1970) సంపుటి వారి భావ పరిణామానికి మార్గదర్శిగా నిలిచింది. "దిక్సూచి" అనే పేరులోనే మార్గదర్శనం ఉంది. ఈ సంపుటిలోని కవితలు దిక్కుల్లేని నిరుద్యోగి, పల్లెలో పోరాటాలు, నలుపులో బుద్ధి వంటి అంశాలపై కేంద్రీకరించబడ్డాయి. ఇది దిగంబర కవిత్వానికి ఆరంభదశగా పరిగణించవచ్చు. గమ్యం (1972) రచన సామూహిక లక్ష్యాన్ని ప్రతిబింబించే సంకలనం. ఇందులో "పల్లవి", "ఫో", "కల్తీ పాలు" వంటి కవితలు ఉన్నాయి. పల్లె ప్రజలు ఎదగాల్సిన దిశ, అవమానాల నుంచి విముక్తి చెందాల్సిన ప్రేరణ ఈ కవితలలో ఉంది. జన్మహక్కు కవితా సంపుటి శీర్షిక నే సాంఘిక న్యాయాన్ని ప్రశ్నిస్తుంది. జీవించటానికి కనీస వనరులే లేని శ్రమజీవుల సమస్యల పై విప్లవ దృక్కోణాన్ని చూపుతుంది. "గంజి నీళ్లు", "కాంతి యుద్ధం" వంటి కవితలు ఇందులో చేరతాయి.గౌరమ్మ కలలు సంపుటిలో గౌరమ్మ అనే స్థూల ప్రతీక ద్వారా పేద మహిళల జీవితం చెప్పారు. వందేమాతరం సంకలనం పేరు ఊహించే మాదిరిగా కాకుండా, దేశభక్తి పేరుతో జరిగే పూజ్యత్వ దుర్వినియోగాన్ని ప్రశ్నిస్తుంది."నన్నెక్కనివ్వండి", "ఎర్రెర్రని తెలంగాణ" వంటి కవితలు, నిజమైన దేశభక్తి అంటే ప్రజల శ్రేయస్సు అనే సందేశాన్ని ప్రతిధ్వనింపజేస్తాయి. ముట్టడి రచనలో విధ్వంసం కాదు, వ్యూహాత్మక ముట్టడి. సామ్రాజ్యవాద భావజాలం, పారిశ్రామిక దోపిడీ, కార్మిక దౌర్భాగ్యం పై స్పష్టమైన విమర్శ. "అశోక చక్రం" అనే కవిత, దేశ చిహ్నాలను విమర్శించడం లో కాదు వాటి విలువల పతనాన్ని ప్రశ్నించడంలో ప్రత్యేకమైనది.విషాదాన్ని జీవితం లో నింపుకున్న వ్యక్తి చెరబండ. విశాలంగా ఉన్న విషాదం ను తన కవిత్వం తో పారదోలే ప్రయత్నం చేసారు

**పాడుతాం పాడుతాం**
**ప్రజలే మానేతలనీ**
**ప్రజాశక్తి గెలుచుననీ**
**(1)**

**ఈ మట్టిని తొలుచుకొనీ**
**విప్లవాలు లేస్తున్నై**
**ఎరుపెక్కిన ఈ మట్టికి**
**మా నెత్తుటి స్వాగతాలు**
**(2)**

**విప్లవాల యుగం మనది**
**విప్లవిస్తే జయం మనది**

ఇలా అద్భుతమైన లయబద్ధమైన కవితా నినాదాలు ఎన్నో వీరి రచనలలో కలవు.

**ప్రముఖ కవితల విశ్లేషణ**

"నన్నెక్కనివ్వండి" కవితలో చిన్నారి బాధల ద్వారా వ్యవస్థలోని అసమానతలు ఉమ్మడి గా వేధింపుగా వర్ణించబడ్డాయి. "ఫో" ఇది వ్యక్తిగత విసుగు కాదు. సామాజిక ఒత్తిడిపై అభ్యంతర స్వరం. శబ్ద ప్రయోగంలో, నిరసనలో ఇది ధ్వనితాత్విక పద్ధతిలో ఉంటుంది. "ప్రపంచం నిండా" కవితలో ప్రపంచాన్ని 'అన్ని వేరే నేస్తం మనం ఒంటరే' అనే భావం నుంచి వెలుపలికి తీసుకురావాలని ఒక గొంతు వినిపిస్తుంది. ఇది ఒంటరితనంపై నిరసన కాదు. సాంగత్యం కోసం పోరాటం. "ఎర్రెర్రని తెలంగాణ" (పాట) తెలంగాణ ఉద్యమాల ఉవ్వెత్తున విరిసిన సంఘర్షణకు ప్రాణం పోసిన దృశ్య రూపం. "బురదలో పూసిన బొమ్మలు కాదు మా ఊరే లక్ష్యం" పదాలు ప్రామాణిక తెలంగాణ ఉద్యమ గీతంగా నిలుస్తాయి.

**చెరబండ రాజు నవలాసాహిత్యం**

తెలుగు సాహిత్యంలో విప్లవోద్యమానికి వాణిగా మారినవారు కొందరే. కేవలం కవిత్వం ద్వారానే కాదు, నవల రూపంలోనూ ఉద్యమ శక్తిని, ఉద్యమ బుద్ధిని ప్రజలకు అందించిన వారిలో చెరబండ రాజు విశిష్ట స్థానం కలిగివున్నారు.చెరబండ నవలలన్నీ ఉద్యమం మూలంగా పుట్టినవే. మా పల్లె (1978) లో రైతు ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసుల వ్యూహాలు, నిర్బంధాలు, నిర్బంధాల్లో వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోయిన కథలు ప్రత్యక్షంగా దర్శనమిస్తాయి. ప్రస్థానం (1981) నవలలో భూస్వామ్య వ్యవస్థ ద్వారా రైతుల వలస జీవితానికి నెట్టివేయబడిన దుస్థితి విశ్లేషించబడుతుంది. దారి పొడుగునా (1985) ఇది పక్కా సిద్ధాంతపరమైన నవల.

**సాంఘిక భావజాలాన్ని విశదీకరించిన రీతులు**

చెరబండ రాజు నవలల్లో మూడు ప్రధాన అంశాలు కనిపిస్తాయి. అవి వ్యక్తి క వర్గం పాత్రగా మారడం, వృత్తి ఆధిపత్య పోరాటము,సానుభూతి సాయుధంగా స్వరాన్ని వినిపించడం. వీరి నవల ల్లోనూ భాష మార్మికంగా ఉంటుంది. అశ్లీల పదాలు ఉండవు. కానీ అవమానాన్ని తిరస్కరించే పదాలే శబ్దబలంగా నిలుస్తాయి. (పాదసూచీ: ముళ్ళపూడి చలపతిరావు, "తెలంగాణ విప్లవ నవలల సాహిత్య ధోరణి", తెలంగాణ కథావేడి, 1998)

**చెరబండ రాజు కథలలో విప్లవ తాత్వికత సారాంశం**

చెరబండ రాజు కథల్లో సామాజిక చైతన్యం, విప్లవ మార్గం, శ్రమ జీవుల బాధలు ప్రధానంగా ప్రతిఫలిస్తాయి. 'బాలిగాడు' కథలో పల్లెలో శ్రమదోపిడీని చూసిన కుర్రాడు పట్నానికి వెళ్ళి ఉద్యమచైతన్యం తెలుసుకుని, తిరిగి గ్రామానికి వచ్చి ప్రజలను చైతన్య పరుస్తాడు.'చిరంజీవి' కథలో పద్నాలుగు ఏళ్ల బాలుడు నక్సలైట్ శిబిరాలను చూపించమంటూ అడవిలోకి తీసుకెళ్లిన పోలీసులు, అతన్ని కాల్చి చంపుతారు. కాని స్టేబుల్ రామ్మూర్తి ఈ దారుణాన్ని తట్టుకోలేక డి.యస్.పి.ని చంపి అడవిలోకి పారిపోతాడు. పోలీసులలోనూ తిరుగుబాటు కలుగుతుందన్న ఆలోచనే కథ నిషేధానికి కారణమైంది. 'పల్లె పిలుస్తోంది' వంటి కథల్లో నగరాల్లో జీవనవేదనను అనుభవించిన ప్రజలు తిరిగి పల్లెకు తిరుగుతున్నారు. ఇది పల్లె గొప్పదని చెప్పటంకాదు, మానవ సంబంధాల పట్ల రచయితకున్న నమ్మకం.ఈ కథల ద్వారా చెరబండ రాజు సామాజిక ఒత్తిడులు, వ్యవస్థల దోపిడి, వర్గపోరాటం, చైతన్యవంతమైన తిరుగుబాటును ప్రతిబింబించారు. అయితే వాస్తవ సంఘటనల ఆధారంగా రాసిన 'చిరంజీవి' కథ నాటకీయంగా ఉండినా, కవిత్వం, పాటల వల్లే చెరబండరాజు చిరంజీవిగా నిలిచారన్నది స్పష్టంగా తెలుస్తుంది.

**జైలు గోడల మధ్యన విప్లవ గళం**

తెలుగు సాహిత్యంలో స్వరం, శ్వాస, శ్రమ అనే మూడు శక్తుల సమన్వయంగా విప్లవ వాఙ్మయాన్ని నిర్మించిన రచయితలలో చెరబండ రాజు గారు ప్రత్యేకమైన స్థానం. వారి జీవితం ఒక సామాన్య రైతు కుటుంబం నుండి మొదలై, విప్లవ మార్గం వైపు,ఉద్యమాల కేంద్రంగా దారితీసింది. 1975 ఏప్రిల్ నెలలో తెలుగు మహాసభల సందర్భంగా శ్రీశ్రీతో కలిసి నిరసన ప్రదర్శన చేయడం వల్ల చెరబండ గారు అరెస్టు చేయబడ్డారు. ఎమర్జెన్సీ ప్రకటించబడిన తర్వాత, దేశమంతటా రాజకీయ విమర్శలకు ఆటంకం ఏర్పడింది. చెరబండ రాజు జీవితంలో ఈ రెండేళ్లు రాజకీయ బంధనాల, ఆరోగ్యపరమైన అవస్థల కాలంగా నిలిచాయి.

వీరు జైల్లో ఉన్న కాలంలో, ఆరోగ్య సమస్యలు పెరిగినా సరే, రచన ఆగలేదు.ఈ సమయంలో కొన్ని కథలు, గేయాలు, ప్రజానాటికలు జైలు గోడల మధ్యనే రాశారు.ఎమర్జెన్సీ అనంతరం, చెరబండ గారికి ఆరోగ్యం శ్రమ కంటే పెద్ద యుద్ధంగా మారింది. దాదాపు 2-2.5 సంవత్సరాల పాటు ఆసుపత్రుల్లోనే గడిపినా, అప్పటికీ సాహిత్యాన్ని విడిచిపెట్టలేదు. వారు చివర్లో రాసిన రచనల పుటలపై స్పష్టంగా కనిపిస్తుంది. "నా శరీరంలో నెత్తురు కాదు / నినాదాలే పారుతున్నాయి" (చెరబండ రాజు వ్యక్తిగత కవితా పంక్తి, అసంపూర్ణ రచన నుండి) అవసాన దశలో క్యాన్సర్ బాధతో బాధపడుతూ కూడా, ఒక అసంపూర్ణ నవలపై పనిచేశారు. ఇది ఆయన కళా శ్రద్ధ, ప్రజా భక్తి కి దర్పణంగా నిలుస్తుంది. అతి స్వల్ప కాలంలోనే చెరబండ రాజు గారు రెండు ప్రధాన సాహిత్య ఉద్యమాలకు చిహ్న పురుషుడిగా నిలిచారు. చెరబండ రాజు 7 కవితా సంపుటాలు, దాదాపు 12 కథలు,ఒక డజనుకు పైగా నాటికలు, నాటకాలు, 3 నవలలు + 1 అసంపూర్ణ నవల రాశారు. ఇవన్నీ జీవనపోరాటాల ధ్వనులతో నిండి ఉన్నాయి.వీటిలో ముఖ్యంగా మా పల్లె, ప్రస్థానం, దారి పొడుగునా, నిప్పురాళ్లు వంటి నవలలు విప్లవాన్ని వచన రూపంలో ముందుకు నడిపాయి.1971-77 మధ్యకాలంలో పోలీసు నిర్బంధాలు, వైద్య శ్రద్ధ లేకపోవడం, తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో అనేక కష్టాలు ఎదుర్కొన్న చెరబండ రాజు, చివరకు క్యాన్సర్‌తో 1982 లో మరణించారు.

**వారి పైన వచ్చిన ముఖ్య గ్రంథాలు**

చెరబండ రాజు జీవితం, రచనలు (సంపాదకులు: వి.వి. రామానా, వెలిచర్ల రవి),విప్లవ కవి చెరబండ (రచన: డా. మల్లెపల్లి లక్ష్మయ్య),సామూహిక కవితా చైతన్యంలో చెరబండ రాజు (రచన: గోరటి వెంకన్న), 'చెరబండ కవిత్వంలో విప్లవ ధ్వని' (వ్యాసం) -ఆచార్య కె. పాండురంగారావు ,'చెరబండ రాజు కవిత్వంలో మార్పు సూచికలు' (వ్యాసం)-డా. వసంత లక్ష్మి,'విప్లవ గేయ సాహిత్యంలో చెరబండ రాజు' (పరిశోధన వ్యాసం) - డా. ఎల్చూరి సుదర్శన్,"విప్లవ కవితా ఉద్యమాల్లో చెరబండ రాజు పాత్ర - ఒక అధ్యయనం" (సిద్ధాంత వ్యాసం2016) డా. రేణుక ,చెరబండ రాజు కవితలు, పాటలు (సంపాదకత్వం1982) వరవర రావు, చెరబండ రాజు కవిత్వం మావో ఆలోచనల ప్రభావం (1981) బెంగళూరు విశ్వవిద్యాలయం సిహెచ్ పెద్దిరెడ్డి, చెరబండ రాజు నవలలు ఒక పరిశీలన (1986) హైదరాబాద్ యూనివర్సిటీ కె.అంజయ్య,సాహిత్య సర్వస్వం చెరబండ రాజు అనే ప్రత్యేక సంపుటి 1986లో విడుదలైంది. ఇందులో అతని కవితలు, పాటలు, సమకాలీనుల అభిప్రాయాలు చోటు చేసుకున్నాయి.,చెరబండ సంస్మరణా కవితలు అనే సంకలనం ప్రజాశక్తి పత్రిక ప్రచురించింది.

చెరబండ రాజుపై వచ్చిన గ్రంథాలు, వ్యాసాలు, పరిశోధనల ద్వారా తెలుగు సాహిత్యంలో ఒక విప్లవ కవికి లభించిన గుర్తింపు మనకు స్పష్టమవుతుంది. ఆయనపై విశ్లేషణలు కేవలం కవిత్వాన్ని మాత్రమే కాక, సమాజంలో సాహిత్య మార్గదర్శకుడిగా ఉన్నత స్థానాన్ని సూచిస్తున్నాయి. భావితరాలకు ఆయనపై వెలువడిన ఈ రచనలు మార్గదర్శకంగా నిలుస్తాయి.

**చిరస్మరణీయుడు చెరబండ**

చెరబండ రాజు గారి అసలు పేరు బద్దం భాస్కర రెడ్డి. కానీ ఆయన ప్రజల మధ్య 'కుల' అనే గుర్తింపు చెరిపివేయాలని తపించిన మానవతావాది. అందుకే ఆయన తన పేరునే మార్చుకున్నారు. ఇదే వారి ప్రగతిశీల స్వరూపానికి తొలి సంకేతం. నామము మార్చుకోవడం ఆయనకు కేవలం వ్యక్తిగత నిర్ణయం కాదు. అది వర్గ, కుల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన అస్తిత్వ విప్లవం. ఇది కవిత్వం ప్రారంభించే ముందు ఆలోచన, ఆవేశం,ఆచరణల మిళితమయిన జీవనపథం.చెరబండ మృతి అనుకోని సంఘటన కాదు. అది రాజకీయంగా, వ్యవస్థాపకంగా వ్యతిరేకతలు ఎదుర్కొన్న ఒక విప్లవ జీవితం మీద వొత్తిడుల యొక్క అవతలి ముఖం. ఆయన మరణం అనేక విప్లవ కవుల, రచయితల హృదయాలను కలచివేసింది.ఈ క్రమంలో విప్లవ కవయిత్రి సావిత్రి గారు, తన భావోద్వేగాన్ని కవితా రూపంలో వ్యక్తీకరించారు.ఆమె పదాల్లో ఆవేదన, ప్రతిష్టంభన, విరోధబలం మూడు పరస్పర పోటీపడి వినిపిస్తాయి. "రాజుకుంటోంది నువ్వు రగిలించిన నిప్పు

**ముంచుకొస్తుంది దోపిడికీ పెనుముప్పు**
**తప్పు చేయని శిక్షించినారు**
**ఒప్పుకోలేమురా నీ చావు మేము**
**ఎప్పటికైనా పగ తీర్చుకొంటాము"**

ఈ కవితలో "రాజుకుంటోంది" అనే పదంతో చరిత్ర లో చెరబండ రాజు శక్తిని గుర్తుచేస్తూ, మరణానంతర వ్యతిరేక శక్తులకు ప్రతిఘటనగా ప్రజాశక్తి నిలుస్తుందని స్పష్టం చేస్తుంది. చివరగా చెరబండ గారిపై చెప్పవలసినది. "మెడపై కత్తి పెట్టినా విలువలకు శిలువలేయని తత్వం"ఇది వ్యక్తిగత ధైర్యానికి మాత్రమే ప్రతీక కాదు. ఇది సాహిత్య నిబద్ధత, ప్రజా ఉద్యమాల నిస్వార్థ మార్గదర్శిత్వానికి పరాకాష్ట.ఈ రోజుల్లో వ్యక్తిగత లాభం కోసం మారిన రచయితల మధ్య, ప్రజల సంక్షేమమే తన శ్వాసగా, కవిత్వమే తన శస్త్రంగా, జాతిపరంగా పోరాటమే తన పునాదిగా మార్చుకున్న వ్యక్తి చెరబండ. ఆయన చెదరని వెలుగు. ఇలాంటి వారు అరుదుగానే సాహిత్య సమాజంలో పుడతారు. వారు జ్ఞాపకాల్లో కాదు సమాజపు మార్గదర్శక తారల్లో స్థిరపడతారు. అలాంటి వ్యక్తిత్వం చెరబండ రాజు. కవిత్వాన్ని ప్రజాసంఘర్షణకు అంకితం చేసిన ఈ కలంయోధుడు తెలుగు విప్లవ సాహిత్యంలో చిరస్మరణీయుడు.

- డా.ఐ.చిదానందం
తెలుగు అధ్యాపకులు, వెల్దండ జూనియర్ కాలేజీ

**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

## ఘనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ జన్మదిన వేడుకలు

- దివ్యాంగులకు పనులు ఫలహారాలు పంపిణీ
- విద్యార్థుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తాం
- ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి, స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ లోని అంద విద్యార్థుల సమక్షంలో కేకు కట్ చేసి పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, పలహారాలు అందించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం, రైతుల కోసం పరితపించే వ్యక్తి అని వారు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా దివ్యాంగులకు ఈ ఒక్కరోజు సేవ చేసే అవకాశం రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పలువురు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఫౌండేషన్ వారు పరిసర ప్రాంతం కోసం వీధి దీపాలను కోరడంతో వారికి అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇక ముందు కూడా అంద విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల కోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంజమూరి రాం కాళేశ్వర్ రెడ్డి, దాసరి మురళీకృష్ణ, సొప్పరి టోనీ, శ్యామ్, జమాల్ పూరి శ్యామ్ లాల్, మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ ఇమ్రాన్, అయాన్ పటేల్, రవి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలి

- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- ఓట్ల సంఖ్య 1200 దాటితే మరొక పోలింగ్ కేంద్రం
- కొత్త పోలింగ్ కేంద్రాలకు బిఎల్ఓలను నియమించాలి
- ఈనెల మూడు నుంచి 17 వరకు శిక్షణ తరగతులు
- దరఖాస్తుల నమోదులో సాంకేతిక లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూభారతి దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుండి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, నజరి నక్షా తయారి, బిఎల్ఓలకు శిక్షణ నిర్వాహణ పై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మంగళవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే అదనపు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కొత్త పోలింగ్ స్టేషన్లలకు బీఎల్ఓలను నియమించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని శిక్షణా కార్యక్రమాలను ఈ నెల 3వ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించాలని, అందుకు మాస్టర్ ట్రైనర్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో నజరీనక్షాకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్ల సరిహద్దుల్లోకి వచ్చే అన్ని కుటుంబాలు, ప్రతి ఇంట్లోని ఓటర్ల సంఖ్య సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఉన్న ఇంటి నెంబరు ఓటరు లిస్టులో ఉన్న ఇంటి నెంబరు సరి చూసుకోవాలి అని అన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో వచ్చిన 22,096 దరఖాస్తులలో 21,718 ఆన్లైన్లో నమోదు చేయడం జరిగిందని, మిగిలిన వాటిని కూడా ఆన్లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల నమోదులో సాంకేతిక లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులన్నింటిని ఈ నెల 10వ తేదీ వరకు పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్ ను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్ఓ సంగీత, కలెక్టరేట్ సూపరిటెండెంట్లు, ఆర్డీఓలు, తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కోలిపుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన జయ వేణు దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యున్నతి కోసం ఆమె చేసిన కృషిని ఉపాధ్యాయులు కొనియాడారు. పాఠశాల అభివద్ధికి అందించిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు బెజ్జంకి రవీంద్ర, శేఖర్, సంజీవరావు, భీంరావు, రుబీనా, పాండురంగ్, శాంత తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటీసీ పుట్ట మధు ఆరోపణలు అర్థరహితం

### మీడియా సమావేశంలో కాటారం మండల కాంగ్రెస్ నాయకులు



**కాటారం, మహా :** మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దళితుల పట్ల చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి దళితులపై కపట ప్రేమ చూపిస్తున్నారని కాటారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో అన్నారు. మంథని నియోజకవర్గంలో పుట్ట మధు తన ఉనికిని కోల్పోవడంతో హైదరాబాద్ కి వెళ్ళి ప్రెస్ మీట్ పెట్టాల్సివచ్చిందని తెలిపారు. ఈ ప్రాంతం లో జరిగిన హత్యలు రౌడీ రాజకీయం పుట్టమధు ఎమ్మెల్యేగా తన పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జరగాయని తెలియజేశారు, దళితులపై కపట ప్రేమ నటిస్తూ దళితులనే హతమార్చిన ఘనత పుట్ట మధుకే దక్కుతుందని,తను దళితుల పక్షాన ఉన్నానంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని,మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తారని, వారికి ఏ సమస్య వచ్చిన క్షణంలో పరిష్కారానికి కృషి చేస్తారని, ఈ ప్రాంత అభివృద్ధి పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి ఆ పనులు చేస్తున్న వ్యక్తి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మండల స్థాయిలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు పూర్తి అవగాహన లేకుండా తమ నాయకుడు ఏం మాట్లాడిన వత్తాసు పలుకుతూ వ్యక్తిగతంగా మంత్రి శ్రీధర్ బాబుపై అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

## యువతకు నైపుణ్యాభివృద్ధి కొరకు ఉచిత శిక్షణ

### మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ పురుషోత్తం

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలోని ఎం.బి.సి. నిరుద్యోగ యువతకు నైపుణ్యం మెరుగుపరిచేందుకు ఉచిత శిక్షణ తరగతులు అందిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థుల వయసు 21 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. దరఖాస్తు ఫారంతో అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం (ఎం.బి.సి. 36 కులాల వారు మాత్రమే), గ్రామీణ ప్రాంతంలో నివాసం ఉండేవారికి కుటుంబ వార్షిక ఆదాయం (గ్రామీణ ప్రాంతంలో 1 లక్ష యాభై వేల రూపాయలు, పట్టణ ప్రాంతంలో నివాసం ఉండేవారు 2 లక్షల రూపాయల వరకు) కలిగి ఉండాలని అన్నారు. అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా ఆన్లైన్లో tgobmms.cgg.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని దరఖాస్తు ఫారానికి ధృవపత్రాలను జత చేసి జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్ 5లో గల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా సమర్పించాలని తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు 4 రోజులు శిక్షణ అందించడం జరుగుతుందని, శిక్షణ కాలంలో అభ్యర్థులకు ట్రావెలింగ్ అలవెన్స్, భోజనం, వసతి సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు.

## సర్కారు బడుల్లో అల్లరి మూకల ఆగడాలు అరికట్టాలి

### జిల్లా ఎస్పీకి టీఎస్ యూటీఫ్ నేతల వినతి

**ఆదిలాబాద్, మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో అల్లరి మూకల ఆగడాలను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని టిఎస్ యూటీఎఫ్ నేతలు కోరారు. ఆ సంఘం నాయకులు మంగళవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ను కలిసి ప్రాతినిధ్యం చేశారు. సెలవు రోజుల్లో, పాఠశాల వర్కింగ్ సమయం తరువాత పాఠశాలల్లో అల్లరి మూకలు చేరి, మద్యం సేవించడం, పేకాట ఆడడం వంటివి చేస్తున్నారని తెలిపారు. ఉదయం పూట ఖాళీ మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. పాఠశాల ఆవరణలోని మౌళిక వసతులను ధ్వంసం చేయడం, మొక్కలను విరగ్గొట్టడం వంటివి కూడా చేస్తున్నారని ఈ అంశంపై చొరవ చూపి, అల్లరి మూకల ఆగడాలను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు ఆ సంఘం నేతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, జిల్లా అధ్యక్షులు కె. కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి. అశోక్, కోశాధికారి కె. శ్రీనివాస్ తదితరులున్నారు.

## గ్రామాలు సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలి

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మహా** పోలీసులు మీ కోసంలో భాగంగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను ఏర్పర్చుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలు, అధికారులు, సిబ్బందితో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎలక్షన్లకు పకడ్బందీగా ఏర్పాట్లు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండటానికి గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా నిమిషాల వ్యవధిలో సమాచారం అందేలా e చూసుకోవాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చాలని తెలిపారు. ప్రతి ఒక్క గ్రామానికి విలేజ్ పోలీసు ఆఫీసర్ ను కేటాయించి ఆ గ్రామాలలో పోలీసు అధికారుల పేర్లు గోడలపై రాయించాలన్నారు. ముఖ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు స్టేషన్ హౌస్ అధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి సరైన దర్యాప్తు చేయాలని దీనివల్ల పోలీసులపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు.

## మెరుగైన సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందాలి



### రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

**ఆదిలాబాద్, మహా:** సమాజంలో వైద్యులకు ప్రత్యేక స్థానం ఉందని, ఆ గుర్తింపును నిలబెట్టుకుంటూ నాణ్యమైన వైద్య సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ సూచించారు. డాక్టర్స్ డే ను పురస్కరించుకుని మంగళవారం స్థానిక రిమ్స్ ఆడిటోరియం లో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు అందిస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం డైరెక్టర్ తో పాటు వైద్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. కేక్ కట్ చేసి డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ ప్రాణాలను లెక్క చేయకుండా వైద్యులు రోగులకు వైద్య సేవలందించారని తెలిపారు. సమాజంలో వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉత్తమమైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. రిమ్స్ కు వచ్చే పేద రోగులకు అందుబాటులో ఉంటూ వారికి నాణ్యమైన వైద్యం అందించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్ రెడ్డి, శిరీష్, సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించద్దు

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీలు**

**రోడ్డు పై చెత్త వేస్తే జరిమాన విధించాలని కమీషనర్ ఆదేశం**



**వరంగల్ మహా;** పారిశుధ్య నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం హన్మకొండ పరిధి లోని 31,7,8 డివిజన్ లలో శానిటేషన్ తనిఖీలతో పాటు వడ్డేపల్లి బండ్ పై స్మార్ట్ సిటీ పనులు ప్రశాంత్ నగర్ లోగల 15 ఏం ఎల్ డి సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ హనుమకొండ పరిధిలోని 30,7,8 డివిజన్ లలో గల హనుమకొండ మెయిన్ రోడ్డు, చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించి గ్రీవెన్స్ లో స్థానికులు అందజేసిన ఫిర్యాదుల ఆధారం గా ఆ ప్రాంతం లో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డిసిల్టేషన్ ప్రక్రియ నిరంతరం జరగాలని మెష్ (జాలీ) లు ఏర్పాటు చేయాలని, ఆక్రమణలకు పాల్పడకుండా చూడాలని ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే పెనాల్టీలు విధించడం,తొలగించడం చేయాలని రోడ్డుమీద చెత్త వేస్తే జరిమానాలు విధించాలని ఆదేశించిన కమిషనర్ నిబంధనలు ఉల్లంఘించి చెత్త వేసిన టీ స్టాల్ యజమానికి రూ.10 వేలు పెనాల్టీ విధించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది తప్పకుండా రెయిన్ కోట్లు ధరించాలని సమయపాలన పాటించడంతో పాటు నాలుగుసార్లు థంబ్ వేయాలని ఆదేశించారు. వడ్డేపల్లి బండ్ ను సందర్శించి స్మార్ట్ సిటీ స్కీమ్ లో భాగంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బండ్ మీద ఏర్పాటు చేయాల్సిన ప్లాంటేషన్ కు సంబంధించిన అంచనాలను తయారు చేసుకుని రావాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. బట్టర్ ఫ్లై పార్కులో ఉన్న సమస్యలను గుర్తించి అట్టి పనుల ను పునరుద్ధరించాలని అన్నారు. అనంతరం ప్రశాంత్ నగర్ లో గల 15 ఏం ఎల్ డి సామర్థ్యం తో నిర్వహించబడుతున్న సీవెజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించి చేపడుతున్న ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకుని నిర్వహిస్తున్న రిజిస్టర్ లను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా రాజారెడ్డి, హెచ్ ఓ రమేష్ , ఈ ఈ రవికుమార్, డి ఈ కార్తీక్ రెడ్డి, ఏఈ మేనక, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక వేగంగా అందించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంచిర్యాల జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుకను త్వరగా సరపర మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భువన కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా, రోడ్లుభవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుకను వేగంగా అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుకను టి.జి.ఎం.డి.సి. ఆధ్వర్యంలో అందించి, పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పనులకు అవసరమైన కంకరను జీరో పర్మిట్ సిస్టమ్ ద్వారా వాహనాలకు వేబిల్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపైనే టెన్షన్..

## పంచాయతీల్లో పోటీపై ఆశావహుల్లో అలజడి

- అనుకూలమా..ప్రతికూలమా అనే అంశంపై ఉత్కంఠ
- రోటేషన్ పద్ధతి అమలుకు ప్రభుత్వం నిర్ణయం
- అప్పుడే పల్లెల్లో వేడెక్కిన రాజకీయం
- ఎన్నికల నిర్వహణ సిద్ధమవుతున్నయంత్రాంగం



ఎవరికి అనుకూలమో..!

**ఆదిలాబాద్, మహా:** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇప్పడంతా వీటిపైనే చర్చ సాగుతోంది. సెప్టెంబర్లోగా ఎన్నికలు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వం యంత్రాంగం ఇందుకు సన్నద్ధమవుతోంది. అప్పుడే పల్లెల్లోనూ ఎన్నికల వాతావరణం కనిపిస్తుండగా.. అందరి దృష్టి రిజర్వేషన్లపైనే కేంద్రీకృతం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ దఫా రొటేషన్ పద్ధతి అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తుండటంతో ఎవరికి అనుకూలంగా వస్తుంది..ప్రతి కూలమెవరికోనని అప్పుడే ఆందోళన మొదలైంది. ఈ నెల నుంచే ఎన్నికల సందడి మొదలు కానుండగా.. ఈ నెలాఖరు లేదంటే ఆగస్టులో కచ్చితంగా ఉంటాయని భావిస్తున్నారు. అధికార యంత్రాంగం సైతం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమవుతోంది.

గత ప్రభుత్వం 2018లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం స్థానిక సంస్థలకు పదేళ్ల ఏళ్ల పాటు (రెండు దఫాలు) ఒకే రిజర్వేషన్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. వీటి ప్రకారమే ఎన్నికలు నిర్వహించగా ..2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తాజాగా ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టానికి 2024లో సవరణలు చేపట్టింది. దీని ప్రకారం ఒకే దఫా రిజర్వేషన్లు ఒకేసారి వర్తించడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పుడున్న రిజర్వేషన్లు తారుమారు కానున్నాయి. దీని ప్రకారం జడ్పీ ఛైర్మెన్ నుంచి సర్పంచ్ వరకు రిజర్వేషన్లు మారనున్నాయి. దీంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు పల్లెల్లో సర్పంచ్ పదవులకు ఏ రిజర్వేషన్ వస్తుందా అనేది అందరిలో ఉత్కంఠకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 166 ఉండగా.. జడ్పీటీసీ స్థానాలు 20 ఉండగా సర్పంచ్ స్థానాలు 473 ఉన్నాయి. వీటిలో పోటీ చేసేందుకు అనేక మంది ఆశావహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కానీ రిజర్వేషన్ అనుకూలంగా వస్తుందా లేదా అనేది వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వారికి అనుకూలంగా రాకపోతే వారి కుటుంబ సభ్యులు, బంధువులు లేదంటే తెలిసిన వారిలో దగ్గరి సంబంధీకులను పోటీలో నిలబెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**పల్లెల్లో మొదలైన సందడి..!**

ఇన్నాళ్లు పంచాయతీ ఎన్నికల కోసం ఆతృతగా ఎదురుచూసిన ఆశావహులకు హైకోర్టు తీర్పుతో ఆనందం వ్యక్తమైంది. ప్రభుత్వం కూడా త్వరలోనే ఎన్నికలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుండటంతో పోటీ చేసే ఆశావహులు అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. గ్రామాల్లో అనుచరులను కూడగట్టడం, పరిచయాలు, పలకరింపులతో హడావుడి వాతావరణం కనిపిస్తోంది. ఇక ఆయా ప్రధాన పార్టీల తరపున పోటీ చేసేందుకు ఎవరికి వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. అప్పుడే టికెట్ల గోల సైతం ప్రారంభమైంది. తనకే టికెట్ వస్తుందంటే..తనకు వస్తుందని ముమ్మర ప్రచారం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆయా పార్టీల కీలక నేతలను తరుచూ కలిస్తూ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు సర్పంచికి పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తుండగా.. మరికొందరు ఎంపీటీసీ, జడ్పీటీసీ బరిలో ఉండాలని ఉవ్విళ్లూరుతున్నారు. రచ్చబండల దగ్గర సైతం ఎన్నికలపైనే చర్చలు సాగుతుండటం పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి.

## పేద ప్రజలే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారు

- ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలి
- ఆస్పత్రి వైద్యాధికారులకు ఆదేశించారు
- వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సందర్శన
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రభుత్వ ఆసుపత్రికి పేద ప్రజలే వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా ఉత్తమ వైద్య సేవలు, సదుపాయాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి అన్ని వార్డులకు స్వయంగా వెళ్లి, రోగులకు అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలతో పాటు ఆసుపత్రికి కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆసుపత్రిలో వైద్యసేవలు, సదుపాయాలకు సంబంధించి అవసరమైనన్ని నిధులు మంజూరు చేయిస్తానని, పని చేయాల్సిన బాధ్యత మీదని.. నిధులు కేటాయించే బాధ్యత మాదని.. సేవలు అందించడంలో రాజీ పడొద్దని వైద్యాధికారులకు తెలిపారు. ఆసుపత్రిలో ఏవైనా వసతులు కావాలన్నా, మరమ్మతులు ఉంటే తాత్కాలికంగా వెంటనే ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల అయినందున అందుకు తగ్గట్లుగానే అన్ని విభాగాల్లో సౌకర్యాలు ఉండాలన్నారు. వైద్యాధికారులు ఎక్కువ సమయాన్ని ఆసుపత్రికి కేటాయించాలని, ముఖ్యంగా ఆక్సిజన్ సరఫరా, ఆరోగ్యశ్రీ, ఓపీ సేవల్లో అంతరాయం కలుగకుడా ఎప్పటికప్పుడు చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్యం, మంచినీటి వసతి వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి పై అంతస్తు భవనం పైకప్పు లీకవుతోందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.

అనంతరం వైద్యాధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సిటీ స్కాన్ తో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని పలువురు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వీలైనంత త్వరగా సిటీ స్కానును ఏర్పాటు చేయాలని, దీంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మళ్లీ నెల తరువాత ఆసుపత్రికి వస్తానని, సూచించిన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మెడికల్ కళాశాల సూపరిటెండెంట్ నాగేందర్, అడిషనల్ డీఎంఎ డా. వాణి, ప్రిన్సిపాల్ డా.త్రివేణి, వైస్ ప్రిన్సిపాల్ డా. తఖియుద్దీన్, ఆర్ఎంఓలు జయమాల, రాజ్కుమార్, టీజీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ దేవేందర్, ఈఈ అజీజ్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** నేరాల నియంత్రణతో పాటు, నేరస్థులను పట్టుకోవడంలో పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. జూన్ నెల సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న కేసులను సమీక్ష జరపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకై అర్బన్, మున్సిపల్, గ్రామ స్థాయిల్లోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి వి.పి.ఓ వద్ద, నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం 6గంటల నుంచే పెట్రోలింగ్ కొనసాగించాలని, పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన విధుల పై ముందుగానే స్టేషన్ అధికారులు తెలియజేప్పాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలకు సంబంధించి అంశం పై పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిప్పుడు పోలీస్ అధికారులు సంబంధిత ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో రోడ్డు ప్రమాదాలకు గల కారణలపై క్షేత్ర స్థాయిలో సమీక్ష జరపాలని సిపి తెలిపారు. యువతను రక్షించుకోవడంలో భాగంగా డ్రగ్స్ అలవాటు పడి పోలీసులకు చిక్కిన యువతను పునరావస కేంద్రాలకు తరలించి చికిత్స అందించేందుకు కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని, పోలీస్ కమిషనర్ తెలియజేసారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుండి ఫిర్యాదుల పై అధికారులు తక్షణమే స్పందించాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, వరంగల్, జనగాం ఏఎస్పీలు శుభం, చేతన్, అదనపు డిసిపిలు ప్రభాకర్, బోనాల కిషన్, ఇ రవి, సురేష్‌కుమార్ తో పాటు ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాలను నేలమట్టం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నియోజకవర్గంలోని మణికొండ మున్సిపాలిటీ పరిధి చిత్రపురి కాలనీలో అక్రమ నిర్మాణాలపై మంగళవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా జులిపించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురికలనీ ప్రాంతంలో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా నిర్మించబడిన అదనపు వీల్లలను మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ తన సిబ్బందితో కలిసి విల్లాలోని అదనపు అంతస్తులను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్బంగా అధికారులు నెలమట్టం చేసిన నిర్మాణాలు పూర్తిగా మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు తలపెట్టిన నిర్దాక్షణ్యంగా కూల్చివేతలు చేపడతామని మణికొండ టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ తెలిపారు.

## చేసిన వెదవ పనికి సిగ్గుపడండి..!

- షాద్ నగర్ లో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై స్పందన
- చట్ట ప్రకారమే ప్రభుత్వం చర్యలు
- షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణాన్ని పరిశీలించిన మంత్రి
- ఎమ్మెల్యే శంకర్ ను ప్రశంసలతో ముంచెత్తిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**షాద్ నగర్, మహా:** చేసిన వెధవ పనికి సిగ్గుపడకుండా దాడులు చేస్తామని ప్రకటనలు చేయడం సహించబోమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కన్హ శాంతి వనం కార్యక్రమానికి హాజరైన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయానికి మంత్రి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నేతలు కృష్ణారెడ్డి, రఘు నాయక్, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూర్ బస్వం, మొహమ్మద్ ఇబ్రహీం, అందే మోహన్, ముబారక్, లింగారెడ్డి గూడా అశోక్, గంగముని సత్తయ్య తదితరులు మంత్రిని కండువాలతో సన్మానించారు.
మంత్రి జూపల్లి కృష్ణారావు షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్బంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వతహాగా కట్టిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కళాశాల నిర్మాణాలను స్వయంగా పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు కళాశాల నిర్మాణ వ్యయం తదితర అంశాలను తెలుసుకొని ఆశ్చర్యపోయారు. దాదాపు 80 శాతం నిధులు ఎమ్మెల్యే సొంతంగా భరిస్తూ మరికొన్ని విరాళాలు పట్టణ ప్రముఖుల ద్వారా స్వీకరించి చేపట్టిన ఈ మహా కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముగ్ధులయ్యారు. ఇంత గొప్ప ఆశయంతో విద్య కోసం ఎమ్మెల్యే శంకర్ పడుతున్న తపన తనను ఆకట్టుకుందని వెంటనే సెల్యూట్ చేశారు. వీర్లపల్లి శంకర్ లాంటి వ్యక్తులు తమ కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినందుకు గర్వపడుతున్నామని అన్నారు. ఇలాంటి స్వప్రయోజనాలు స్వార్థ చింతన లేకుండా భవిష్యత్ తరాల బాబు కోసం మంచి విద్యను అందించేందుకు మౌలిక సదుపాయాల రూపకల్పనలో భాగంగా సొంత నిధులు వెచ్చించి గొప్పగా ఆలోచించి ఈ కార్యక్రమానికి పూనుకోవడం తనను అమితంగా ఆకట్టుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంసించారు. అదేవిధంగా కళాశాలలో విద్యాభివృద్ధి కోసం గత విద్యా సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా స్వయంగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే విషయాన్ని మీడియా అదే విధంగా లెక్చరర్లు స్థానిక నాయకులు కూడా చెప్పడంతో మంత్రి మురిసిపోయారు. అదేవిధంగా చెత్త కాగితాలు ఏరుకునే మురికివాడలోని పిల్లలను చేరదీసి ఆర్థికంగా వారికి కొంత ఖర్చు చేసి అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలకు తీసుకెళ్లి వారిని చేర్పించడం ఇలాంటి విషయాలను న్యూస్ చానల్స్ తెలుసుకొని మంత్రి పొంగిపోయారు. ఇంత గొప్ప ఆలోచనతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే శంకర్ లాంటివాళ్లు ఈ సమాజానికి ఎంతో అవసరమని జూపల్లి కృష్ణారావు వివరించారు..



## ఘనంగా డీసీసీబి చైర్మన్ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ పాఠశాలకు లౌడ్ స్పీకర్లు అందజేత
- విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ- కొత్తకుర్మ తిలక్

**రంగారెడ్డి జిల్లా మహా:** కొత్తకుర్మ సత్తయ్య జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తుర్కయంజాల్ మండలంలోని కమ్మగూడ ప్రాంతంలో ఉన్న ఏపీపీఎస్ శ్రీ శ్రీ నగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో, టీజీకాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య జన్మదినం సందర్భంగా కొత్తకుర్మ తిలక్, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠశాల కోసం లౌడ్ స్పీకర్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సరదాగా వాళ్లతో గడపడం జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కొత్తకుర్మ తిలక్ ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ కాంగ్రెస్ నాయకుడు మేతరీ శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, అభిమానులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బీసీలు అంటే అభిమానం ఉన్న వ్యక్తి రేవూరి



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్ నందు స్థానిక కార్పొరేటర్ బిఆర్ఎస్ నాయకులు చేసిన అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ 16వ డివిజన్ కీర్తి నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ హుజుర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 16 డివిజన్ అధ్యక్షులు దుపాకి సంతోష్ కుమార్ సోమవారం బిఆర్ఎస్ కార్పొరేటర్, కార్పొరేటర్ భర్త సుంకర శివ నాయకులు చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. సంతోష్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో కమిషన్లు, అక్రమాలకు పాల్పడిన వారు ప్రజా ప్రభుత్వం పై స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని ప్రజలు మీ మాయ మాటలు నమ్మే పరిస్థితిలో లేరని, పది సంవత్సరాలు ప్రజలను మోసం చేసిన మిమ్మల్ని ఈ కీర్తి నగర్ ప్రజలు మర్చిపోరని మీ బీఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినకుండా ఇష్ట రాజ్యాంగా వ్యవహరించి భూకబ్జాలకు, అక్రమాలకు పాల్పడి ఇప్పుడు కమిషన్లు లేక మతిభ్రమించి ఎమ్మెల్యే పై అసత్య ప్రచారాలు చేయడం సరైనది కాదని అన్నారు. అభివృద్ధి గురించి బిఆర్ఎస్. నాయకులు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేసారు. పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి తరచు మహానగర పాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికి, అప్పుడు పరకాల నియోజకవర్గం పరిధిలోని మూడు డివిజన్ ల సమాచారం తెలుసుకుంటూ ప్రజల కోసం శ్రామిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందరికీ అందిస్తున్న నాయకుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అని సుధీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేత రేవూరి ప్రకాష్ రెడ్డి అని వారి రాజకీయ అనుభవం అంత వయస్సు లేని వ్యక్తులు ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి , మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్ లో ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం కనీస మౌలిక సదుపాయాలు కల్పనపై విద్యా, టిజిడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పనకు జిల్లాలోని 5 జూనియర్ కళాశాలలకు రూ 41.07 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇట్టి నిధులతో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు. ఈ నిధులతో సివిల్ మరమ్మతులు, ఎలక్ట్రికల్, మంచినీరు, పారిశుధ్య కార్యక్రమాలు వంటి సదుపాయాలపై ఫోకస్ చేయాలని, ఇట్టి పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న, డీఈఓ రాజేందర్, టీజడబ్ల్యూఐడిసి డిఈ రామకృష్ణ, ఏఈ మహేందర్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థిక సంక్షేమ పథకాల అమలుపై ప్రచారం**
**లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి**

జూలై 1వ తేది నుండి సెప్టెంబర్ నెలాఖరు వరకు జరుగనున్న జనసురక్షా ప్రచార కార్యక్రమం భారత ప్రభుత్వం ఆదేశాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో ఆర్థిక సంక్షేమ పథకాలపై సమగ్ర శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎల్డిఎం తిరుపతి తెలిపారు. మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - కాటారం శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగహన కార్యక్రమంలో ఎల్డిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తిరుపతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధానంగా ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కే వై సి పునరిద్దరణ నూతన నమోదులు, పునర్నవీకరణలను చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఈ ప్రధాన ఆర్థిక సామాజిక భద్రతా పథకాల పరిధిని 100% పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యంగా కొనసాగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటారం ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్,అంకుషాపూర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షున్ని కలిసిన రాజనాల శ్రీహరి



**వరంగల్ మహా;** హైదరాబాదులోని గాంధీ భవనంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన గ్రేటర్ వరంగల్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. హైదరాబాదు లో జరగబోయే ఖర్గె సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి జరగబోయే సభకు వరంగల్ నుంచి పెద్ద ఎత్తున జనాన్ని తరలించాలని రాజనాల కు సూచించగా అందుకు రాజనాల నా బాధ్యతను నేను తప్పక నిర్వహిస్తానని పిసిసి అధ్యక్షుడికి తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కూల్చివేత

- పట్టా భూమి అంటూ అధికారులకు అడ్డు తగిలిన గ్రామస్తులు
- రెవెన్యూ సదస్సులోను మా భూ సమస్యలు పరిష్కారం కాలే



**రాజేంద్రనగర్ మహా;** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ గూడ రెవెన్యూలో సర్వే నంబర్ 62, 28లో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయి అనే ఫిర్యాదుతో మండల తాసిల్దార్ రవీందర్ దత్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ, తమ సిబ్బందితో కలిసి నిర్మాణాలను కూల్చివేశారు. కూల్చివేతలను బహదూర్ గూడా గ్రామస్తులు, రైతులు అధికారులకు అడ్డు తగిలారు. 70 సంవత్సరాలు పైగా ఈ భూములలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాం. సేతు వార్ ,టిఫన్ , కాస్రా, పానీలలో తమ పేర్లు వస్తున్నాయి. బహదూర్గుడ భూ సమస్యలకు సంబంధించిన రికార్డులను ప్రభుత్వ అధికారులు పరిశీలించి తమకు చెందవలసిన భూమిలకు పట్టా పాస్బుక్కులు ఇవ్వాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ఇప్పటికీ ప్రదక్షిణలు చేస్తున్నాం. ఇవన్నీ తెలిసి ప్రభుత్వ భూమి అంటూ తమ పొలాల్లోకి వచ్చి దౌర్జన్యం చేయడం ఏంటని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేపట్టరాదని ఎమ్మార్వో రవీందర్ దత్ తెలిపారు.

### గ్రామస్తులు రైతులు ఆందోళన..

బహదూర్ గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1నుండి 101 సర్వేనెంబర్ వరకు గ్రామస్తులు 70 సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాం. 62,28 సర్వేనెంబర్ విలేజ్ మ్యాప్ లో ప్రభుత్వ భూమి ఎంత ఉంటే అంత తీసుకొని మిగతా భూమి తమ గ్రామస్తులకు ఇవ్వాలన్నారు. సేతు వార్ ,టిఫన్ , కాస్రా, పానీలలో తమ పేర్లు వస్తున్నాయి. ఎమ్మార్వో ఆర్డీవో కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ఇప్పటికీ తమ గ్రామస్తులు తిరుగుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా తమకు పట్టా పాస్బుక్కులు ఇస్తామని హామీలు ఇస్తున్నారు. తీరా ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రాసెస్ లో ఉన్న అంటూ పోసిటింగ్ ఆర్డర్ పెండింగ్లో ఉందంటూ అధికారులు చెబుతున్నారు. ఈ భూమిని నమ్ముకుని మూడు తరాలు అయ్యింది. అవసరానికి వేరే దారి లేక పిల్లల చదువులకు పెళ్లిళ్ల కొరకు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయ భూములను ఎకరా అద్దెకురాను అమ్ముకొని పిల్లల భవిష్యత్తు కోసం అమ్ముతున్నాము. మూడు తరాలుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. అన్నీ ఉన్న అల్లుడి నోట్ల శని అన్నట్లు తయారయ్యాయి మా బతుకులు. పట్టా పాస్ బుక్కులు ఇవ్వకుండా సంవత్సరాల నుండి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. గత ప్రభుత్వాలు పట్టా పాస్బుక్కులు ఇస్తామని బిఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. తీరా చూస్తే ప్రభుత్వం మారింది, కాంగ్రెస్ ప్రభుత్వం ఏ గ్రామంలో నైనా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశామన్నారు. మా గ్రామం వచ్చేసరికి సమస్యలు పరిష్కారం కాకుండా భూ సమస్యగానే మా గ్రామం మిగిలింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కి రెవెన్యూ మంత్రికి కలెక్టర్లకు బహదూర్ గూడ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు పరిశీలించి తమకు చెందాల్సిన భూములకు పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని మొరపెట్టుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కుమ్మరి నరసింహ, వెంకటేష్ గౌడ్, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సభను విజయవంతం చేయాలి

### పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన కొండా మురళి



**వరంగల్ మహా;** ఈనెల 4న గ్రామస్థాయి నేతలతో హైదరాబాద్ లోని ఎల్బి స్టేడియంలో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఓ సిటీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ గ్రామస్థాయి, డివిజన్ స్థాయి కార్యకర్తలతో నేరుగా మాట్లాడాలనే ఆలోచనతో నిర్వహించ తలపెట్టిన సభకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, ఎందుకు వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు నాయకులు, కార్యకర్తలు, పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంటు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్చార్జిలుగా నియమితులైన టి.పి.సి.సి. ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, టిపిసిసి ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీనుబాబు, పల్లె శ్రీనివాస్ గౌడ్ ,మోత్కూరి ధర్మారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు , కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత దగ్గు మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులో పోలీస్ తనిఖీలు

**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం కు అందిన సమాచారం మేరకు మంగళవారం పోలీసులు డ్రగ్ అధికారి జన్ను కిరణ్ రంగశాయి పేట లోని ఆయుష్ మందుల షాపులో విస్తృతమైన తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా మత్తు కలిగించే ప్రభుత్వ నిషేధిత దగ్గు మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున నిషేధిత దగ్గు మందులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసారు. ఈ తనిఖీల్లో ఆర్. ఐ శివ కేశవులు, ఆర్. ఎస్. ఐ మనోజ్, పూర్ణ, నాగరాజు తోపాటు యాంటీ డ్రగ్స్ కంట్రోల్ వింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.




## భూపాలపల్లి జిల్లాలో 89.6 శాతం రేషన్ బియ్యం పంపణీ

**భూపాలపల్లి, మహా :** వర్షాకాలంలో స్టేషన్ బిఎఫ్ కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా జూన్, జూలై, ఆగస్టు మాసములకు సంబంధించిన ప్రజా పంపిణీ జూన్ మాసంలో 89.6 శాతం పంపిణీ చేయడం చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లికు సంబంధించి మొత్తం 1,25,588 కార్డుదారులకు గాను 1,08,492 (86.38) కార్డు దారులకు 6356.524 మెట్రిక్ టన్నుల (89.6 %) బియ్యమును పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డులకు సంబందించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేయబడుతుందని మరియు కొత్త కార్డుల జారీ ప్రక్రియ నిరంతర కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు సంబంధించి మొత్తము 9,362 దరఖాస్తులను కొత్త కార్డు కొరకు మీసేవ ద్వారా స్వీకరించడం జరిగిందని అన్నారు. అందులో 4,520 కార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన 4,396 లబ్ధిదారులకు కార్డులను మంజూరు చేయడమైనదని 16,803 దరఖాస్తులను కుటుంబ సభ్యుల చేర్పుల కొరకు స్వీకరించడం జరిగిందని, అందులో 14,377 దరఖాస్తులను మంజూరు చేసినట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డు జారీ ప్రక్రియలో మధ్యవర్తి లేదా దళారులను ఆశ్రయించకూడదని, ఒకవేళ చట్టవ్యతిరేఖ పనులు చేసినట్టు గుర్తించిన యెడల, అట్టివారి మీద చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకొనబడునని ఆయన తెలిపారు.

## స్థిరమైన అభివృద్ధికి విద్యార్థులు రాయబారులుగా ఉండాలి

### తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మంగళవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జ్ఞానం, ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధికి రాయబారులుగా విద్యార్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. వాతావరణ మార్పు, పంటకోత తర్వాత నష్టాలు, మార్కెట్ అస్థిరత వంటి అత్యంత ముఖ్యమైన ఉద్యానవన సవాళ్లను ఎదుర్కోవడానికి అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, బలమైన భాగస్వామ్యాలు ఉండాలన్నారు. భారతదేశం మరింత, స్థిరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నొక్కిచెప్పారు. 353 మిలియన్ టన్నులకు పైగా ఉద్యాన ఉత్పత్తితో, భారతదేశం ప్రపంచ నాయకుడిగా నిలుస్తోంది. పండ్లు, కూరగాయలలో చైనా తర్వాత రెండవ స్థానంలో ఉంది. అరటి, మామిడి, బొప్పాయి ఉత్పత్తిలో మనం ప్రపంచంలోనే ముందున్నాం. ఉల్లిపాయలు, అల్లం, బెండకాయల ఉత్పత్తిలో అగ్రస్థానం మనది. అలాగే తెలంగాణ ఉద్యాన శక్తి కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. 12.94 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణంలో ఉన్న ఉద్యానవన పంటలు 61.64 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో, ఈ రంగం రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తిలో 34% వాటాను కలిగి ఉందన్నారు. ఇది కేవలం వ్యవసాయ విస్తీర్ణంలో కేవలం 7% మాత్రమే, తెలంగాణ మిరప ఉత్పత్తిలో రెండవ స్థానంలో , పసుపులో మూడవ స్థానంలో ఉంది. మామిడి పండ్లు భారతదేశం అంతటా, విదేశాలకు ఎగుమతి చేయబడుతున్నాయి అన్నారు. ములుగు జిల్లా ఎస్, తద్వాయి మండలంలో ఉన్న కొండపర్తి అనే గిరిజన గ్రామాన్ని దత్తత తీసుకున్న రాజ్ భవన్ రైతులకు సహాయం చేయడానికి విశ్వవిద్యాలయం ఆఫ్ క్యాంపస్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక సహాయాన్ని అందించాలని కోరారు. కారం, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాల మిశ్రమాలను ఉత్పత్తి చేయగల మసాలా ప్రాసెసింగ్ యంత్రాల సంస్థాపనకు దోహదపడిందన్నారు. భారతదేశం 2027 నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు. గవర్నర్ పలువురు విద్యార్థులకు బంగారు పథకాలను ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్దా జనయ్య; వెటర్నరీ విశ్వవిద్యాలయం విసి డాక్టర్ జ్ఞాన ప్రకాష్, ఐ ఐ ఓ ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె మాథుర్, డాక్టర్ ఎ. భగవాన్, డాక్టర్ జె. చీనా, సురేష్, సీనివాసన్, ప్రశాంత్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ డివిజన్ పరిధి ఉప్పర్ పల్లి గాంధీ నగర్ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం సందర్భంగా మంగళవారం దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
అమ్మవారి ఆశీర్వచనాలు పొందారు.

## దివ్యాంగుడి జీవనోపాధికి ఆర్థిక సాయం చేసిన కోడం శివ కృష్ణ

### హర్షం వ్యక్తం చేసిన దివ్యాంగ నాయకులు



**వరంగల్ మహా;** తను అభిమానించే నాయకుడి అడుగుజాడల్లో నిరుపేదలకు సేవ చేయడానికి పదవే అవసరం లేదని, సేవ చేయాలన్న తపన ఉంటే చాలని నిరూపించారు కొండా దంపతుల వీరాభిమాని కోడం శివకృష్ణ.. వరంగల్ తూర్పు నియోజకవర్గం 33వ డివిజన్ లోని అంకం సంపత్ అనే నిరుపేద దివ్యాంగుడు జీవనోపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారి చాలా కష్ట కాలంలో ఉన్న ఇతనికి జిల్లా దివ్యాంగుల సంఘం సహకారంతో పాటు జీవనోపాధి కై షాపును నడుపుకొనుటకు ఒక డబ్బాను ఇప్పించడం జరిగింది. దీనిలో ఇతను టైర్ల పంపుచార్ షాపును ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దివ్యాంగుడైన అంకం సంపత్ కు కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు కోడం శివకృష్ణ మంగళవారం టైర్ల పంపుచార్ షాపు నడుపుకొనుటకు కావలసిన పరికరాల తో పాటు టైర్లను, ట్యూబులను, గాలి పంపును తన సొంత ఖర్చులతో ఇప్పించి తన సేవా గుణాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా అంకం సంపత్, జిల్లా దివ్యాంగ నాయకులు కోడం శివకృష్ణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో కోడం శివకృష్ణ రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదగాలని నిరుపేదలతో పాటు దివ్యాంగులకు అండగా నిలిచి ఇలాగే సహాయ సహకారాలు అందించాలని వారు ఆకాంక్షించారు. ముఖ్యంగా నిరుపేద దివ్యాంగులకు జీవనోపాధి కల్పించుటకై మనసున్న దాతలు సహాయం చేయడానికి ముందుకు రావాలని శివకృష్ణ కోరారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నాయకులు బండి చక్రపాణి, గై సతీష్, బత్తిని రాజు, నీలం రాజు మరియు డివిజన్ కాంగ్రెస్ నాయకులు కత్తెర శాల శ్రీధర్, హుస్సేన్, బైరి ప్రతాప్,మిట్ట నిశాంత్, బొమ్మగాని శ్రీనివాస్, ఇట్టబోయిన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ బ్యాంకుల్లో ఎల్ఐసీ పాలసీలు




ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూ ఎస్ఎఫ్బీ) తెలిపింది. దీని ప్రకారం ఎల్ఐసీ టర్మ్ పాలసీలు, ఎండోమెంట్ ప్లాన్లు, హోల్ లైఫ్ పాలసీలు మొదలైన వాటిని తమ శాఖల్లో విక్రయించనున్నట్లు పేర్కొంది. 21 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో తమకు 2,456 పైగా బ్యాంకింగ్ టచ్‌పాయింట్లు ఉన్నట్లు బ్యాంక్ ఈడీ ఉత్తమ్ టిబ్రెవాల్ తెలిపారు. ఈ ఒప్పందంతో ఓవైపు బ్యాంకింగ్, బీమా, దీర్ఘకాలిక ఆర్థిక ప్లానింగ్ సొల్యూషన్స్ అన్నింటినీ ఒకే దగ్గర అందించే సంస్థగా తమ బ్యాంక్ స్థానం పటిష్టమవుతుందని మరోవైపు గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో ఎల్ఐసీ పాలసీల విస్తృతి మరింతగా పెరుగుతుందని వివరించారు. బ్యాంకింగ్, భద్రత, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను ఒకే ప్లాట్ఫామ్ కింద సమీకృతం చేస్తూ, పూర్తిస్పెక్ట్రమ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రొవైడర్‌గా మారడానికి ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సాగిస్తున్న ప్రయాణంలో ఈ సహకారం ఒక మైలురాయిని సూచిస్తుంది. ఎల్ఐసీకి కూడా ఈ భాగస్వామ్యం విశ్వసనీయమైన, కస్టమర్ సెంట్రిక్ బ్యాంకింగ్ భాగస్వామి ద్వారా విస్తృత పరిధిని అందిస్తుంది.

సంజయ్ అగర్వాల్ 1996లో స్థాపించిన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ భారతదేశంలో అతిపెద్ద స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుగా పనిచేస్తుంది. 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ 1.13 కోట్లకు పైగా కస్టమర్లకు సేవలు అందించింది. బ్యాలెన్స్ షీట్ పరిమాణం రూ .1.57 లక్షల కోట్లు. 'ఏఏ / స్టేబుల్' క్రెడిట్ రేటింగ్ ఈ బ్యాంకుకు ఉంది.

# అనిల్ అంబానీ మరో భారీ అడుగు..



సుమారు రూ. 20,000 కోట్ల భారతీయ డిఫెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) మార్కెట్‌లో విస్తరణపై రిలయన్స్ డిఫెన్స్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన కోస్టల్ మెకానిక్స్‌తో చేతులు కలిపింది. భారతీయ సాయుధ బలగాలకు అవసరమైన ఎంఆర్వో, అప్‌గ్రేడ్, లైఫ్‌సైకిల్ సపోర్ట్ సొల్యూషన్స్‌ను అందించడంపై ఫోకస్ చేయనున్నట్లు రిలయన్స్ డిఫెన్స్ మాతృ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రా ఒక ప్రకటనలో తెలిపింది. 100కు పైగా జాగ్వార్ ఫైటర్ విమానాలు, 100 పైచిలుకు మిగ్-29 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు, ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్‌లు మొదలైన వాటి ఆధునీకరణకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని వివరించింది. డీల్ ప్రకారం భారత్‌తో పాటు ఎగుమతి మార్కెట్లలోని క్లయింట్లకు సేవలు అందించేందుకు రిలయన్స్ డిఫెన్స్, కోస్టల్ మెకానిక్స్ కలిసి మహారాష్ట్రలో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తాయి. దీనితో సాయుధ బలగాలు ఉపయోగించే గగనతల, భూతల డిఫెన్స్ ప్లాట్‌ఫాంల నిర్వహణ, అప్‌గ్రేడ్ సర్వీసులను అందించనున్నట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రా పేర్కొంది. 1975లో ఏర్పాటైన కోస్టల్ మెకానిక్స్‌కు అమెరికా ఎయిర్‌ఫోర్స్, ఆర్మీకి కీలక పరికరాలను సరఫరా చేస్తోంది.

# ఆదుకున్న ఆర్‌బీఐ భారీ డివిడెండ్




ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి రెండు నెలల్లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 0.8 శాతంగా (రూ.13,163 కోట్లు) ఉన్నట్టు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ప్రకటించింది. ఆర్‌బీఐ నుంచి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్ రావడం ఇందుకు అనుకూలించింది. డివిడెండ్, ప్రాఫిట్స్ కింద ప్రభుత్వం రూ.2.78 లక్షల కోట్లను అందుకున్నట్టు సీజీఏ తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతం (రూ.15.69 లక్షల కోట్లు)గా ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొనడం గమనార్హం. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 3.1 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వరకే చూస్తే ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 11.9 శాతం (రూ.1.86 లక్షల కోట్లు)గా ఉండడం గమనించొచ్చు. ఏప్రిల్, మే నెలలకు కలిపి రూ.3.5 లక్షల కోట్ల పన్నుల రూపంలో, రూ.3.56 లక్షల కోట్లు పన్నేతర ఆదాయం రూపంలో సమకూరింది. నాన్ డెట్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో రూ.25,224 కోట్లు వచ్చింది. వ్యయాలు రూ.7.46 లక్షల కోట్లుగా ఉన్నాయి.

# గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు



దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గాయి. చమురు మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను రూ .58.50 తగ్గించాయి. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.1,665కు దిగొచ్చింది. అంతకుముందు జూన్‌లోనూ చమురు సంస్థలు వాణిజ్య సిలిండర్లపై రూ .24 తగ్గింపును ప్రకటించాయి. దాంతో 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ .1,723.50 గా ఉండేది. ఏప్రిల్లో దీని ధర రూ.1,762గా ఉంది. ఫిబ్రవరిలో స్వల్పంగా రూ.7 తగ్గగా, మార్చిలో రూ.6 పెరిగింది. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధర రూ.58.50 తగ్గించడం చిన్న వ్యాపారులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య వినియోగదారులు తమ రోజువారీ కార్యకలాపాలకు ఈ గ్యాస్ సిలిండర్లపై ఎక్కువగా ఆధారపడతారు.

అయితే, గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. సమీక్షకు పిలుపునిచ్చినప్పటికీ 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధర స్థిరంగా ఉంది. 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదని కంపెనీలు ధృవీకరించాయి.

# అపోలో ఫార్మసీ వ్యాపారంలో విభజన




**హైదరాబాద్ :** వ్యూహాత్మక పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఆమ్నీచానల్ ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాలను విడదీసి, లిస్ట్ చేసే ప్రతిపాదనకు అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ (ఏహెచ్ఈఎల్) బోర్డు ఆమోదముద్ర వేసింది. దీనికి సంబంధించిన స్కీము ప్రకారం లిస్టింగ్‌కు 18-21 నెలల వ్యవధి పట్టనుంది. ఇందులో భాగంగా తొలి దశలో ఆమ్నీచానల్ ఫార్మా, డిజిటల్ హెల్త్ వ్యాపారాన్ని కొత్త సంస్థగా విడగొడతారు. తర్వాత హెల్త్‌కేర్ విభాగం అపోలో హెల్త్‌కో (ఏహెచ్ఎల్), హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్ కీమెడ్‌ను కొత్త సంస్థలో విలీనం చేస్తారు. ఈ ప్రక్రియతో దేశీయంగా దిగ్గజ ఆమ్నీచానల్ ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫాం ఏర్పడుతుందని అపోలో హాస్పిటల్స్ తెలిపింది. ఇది 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 25,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగలదని పేర్కొంది. స్కీము ప్రకారం కొత్త సంస్థ, స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్టింగ్‌కు దరఖాస్తు చేసుకుంటుంది. ఏహెచ్ఈఎల్ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న ప్రతి 100 షేర్లకు గాను కొత్త కంపెనీకి చెందిన 195.2 షేర్లు లభిస్తాయి. అత్యంత నాణ్యమైన హెల్త్‌కేర్ సేవలను కోట్ల మందికి అందుబాటులోకి తెచ్చేందుకు ఈ మోడల్ ఉపయోగపడుతుందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# మహా యూటర్న్ చూసి.. రెండు భాషలకు కర్నాటక




ముంబై: మహారాష్ట్ర పాఠశాలల్లో త్రిభాషా విధానం అమలు చేయాలనుకున్న ప్రభుత్వ నిర్ణయంపై వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈ పరిణామాలను గమనించిన కర్నాటక కూడా ద్విభాషా విధానానికే కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)దేశవ్యాప్తంగా పాఠశాలల్లో త్రిభాషా సూత్రాన్ని సిఫార్సు చేసినప్పటికీ, కర్ణాటక ప్రభుత్వం అధికారికంగా దానిని తిరస్కరించింది. మహారాష్ట్ర సర్కారు ప్రాథమిక పాఠశాలలకు త్రిభాషా విధానాన్ని నిలిపివేసిన దరిమిలా, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తమ ప్రభుత్వం కూడా పాఠశాల విద్యావిధానంలో ద్విభాషా సూత్రానికి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. మైసూరులో విలేకరులతో మాట్లాడిన సిద్ధరామయ్య తాము ద్విభాషా విధానానికి అనుకూలంగా ఉన్నామని, తమ ప్రభుత్వం దీనికే కట్టుబడి ఉంటుందని ప్రకటించారు. వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలల్లో భాషా విధానాలపై చర్చలు జరుగుతున్న సమయంలో సీఎం ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. కర్ణాటక పాఠశాలల్లో ప్రస్తుతమున్న విద్యావిధానంలో.. విద్యార్థులు ఐదవ తరగతి వరకు రెండు భాషలు నేర్చుకోవాలి. ఆరవ తరగతి నుండి హిందీని మూడవ భాషగా ప్రవేశపెడతారు. ఎనిమిదవ తరగతిలో విద్యార్థులకు కన్నడ, ఇంగ్లీష్ లేదా సంస్కృతంలలో ఏదో ఒక దానిని మొదటి భాషగా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎవరైనా విద్యార్థి సంస్కృతాన్ని మొదటి భాషగా ఎంచుకున్న పక్షంలో, వారికి కన్నడ మూడవ భాషగా తప్పనిసరి అవుతుంది.



# ఇలా చేస్తే... వేగంగా వైఫై సిగ్నల్స్!

**ఇంట్లో వైఫై సిగ్నల్స్ సరిగ్గా లేవా? ఒకరిద్దరు మాత్రమే వాడుతున్నా ఇంటర్నెట్ స్లో అవుతోందా? అయితే మీ వైఫై రూటర్ ఎక్కడ పెట్టారో ఒకసారి చూసుకోండి. సరైన ప్రాంతంలో లేకపోతేనే ఈ సమస్యలన్నీ వస్తాయి మీకు! మరి.. ఇంట్లో వైఫై రూటర్ ఉంచేందుకు బెస్ట్ ప్లేస్ ఏంటి?**

ఇంటర్నెట్ వాడకం బాగా పెరుగుతున్న ఈ కాలంలో చాలా ఇళ్లల్లోకి వైఫై రూటర్లు వచ్చేశాయి. అయితే ఎక్కువమంది వీటిని ఎవరికీ కనిపించని చోట ఉంచేస్తూంటారు. కొందరు పుస్తకాల అలమారాలో లేదంటే టేబుళ్ల కింద కుక్కేస్తూంటారు. దీనివల్ల వాటి నుంచి వెలువడే రేడియో సిగ్నల్స్ మన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఫైర్ స్టిక్స్ వంటివాటికి సరిగ్గా సంకేతాలు పంపలేదు. రేడియో సిగ్నల్స్ ఓపెన్ స్పేసెస్‌లో బాగా ప్రయాణిస్తాయన్న విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి మనం. అడ్డంకులు ఎన్ని ఎక్కువ ఉంటే.. వాటి శక్తి అంత తగ్గిపోతూంటుందన్నమాట. దీంతో ఇంటర్నెట్ వేగమూ మందగిస్తుంది.

వైఫై రూటర్‌ను నేలపై ఉంచడం కూడా సరికాదు. సిగ్నల్ స్ట్రెంగ్త్ గరిష్టంగా ఉండదు. శక్తిమంతమైన రేడియో తరంగాలు ఎక్కువగా కిందివైపు ప్రయాణిస్తూంటాయి. నేలపై ఉంచితే సిగ్నల్స్ కాస్తా నేలల్లోకి వెళ్లిపోతాయన్నమాట. ఇలా కాకుండా.. ఎత్తుగా ఉన్న చోట్ల ఉంచడం మేలు. కుర్చీలు, టేబుళ్ల వెనుక ఉంచినా చిక్కే. గోడలున్నా సిగ్నల్స్ సులువుగా ప్రయాణించలేవు. ఇంకొంత మంది వైఫై రూటర్‌ను ఎవరికీ కనిపించకుండా ఉండాలని ఎక్కడో ఒక మూలన దాచేస్తూంటారు. దీనివల్ల కూడా వైఫై సిగ్నల్స్ పూర్తిస్థాయిలో వాడుకోలేము.

ఇంట్లో రెండు వైఫై రూటర్లు ఉండి.. వాటిని పక్కపక్కనే పెట్టారనుకోండి. నెట్ వేగం పడిపోయేందుకే అవకాశాలు ఎక్కువ. ఎందుకంటే వైఫై అనేది నిర్దిష్ట స్పెక్ట్రమ్‌లో రేడియో తరంగాలను ప్రసారం చేస్తూంటుంది. రెండూ ఒకే స్పెక్ట్రమ్‌లో ప్రసారం చేస్తూంటే... ఒకదాని సిగ్నల్ ఇంకోదానితో ఇబ్బంది పడటం ఖాయం. ఏతావాతా.. ఇంట్లో వైఫై సిగ్నల్స్ బాగా ఉండాలంటే... పూర్తి సామర్థ్యం మేరకు వాడుకోవాలంటే రూటర్లను అందరికీ కనిపించేలా ఏదైనా ఎత్తైన టేబుల్ లేదా షెల్ఫ్‌లో ఉంచడం మేలు. వీలైనంత వరకూ వైఫైకి అడ్డుగా ఏ వస్తువు పెట్టకూడదు. గోడలకు లేదా మందంగా ఉండే ఫర్నీచర్‌కు ఒకట్రెండు అడుగుల దూరంలో ఉంచడం అవసరం.

# ఒక్క నెలలో 18 గుండెపోటు మరణాలు.. హసన్‌పై విచారణకు ఆదేశాలు




**హసన్:** దేశంలో ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాల సంఖ్య మరింతగా పెరుగుతూ వస్తోంది. ఇదే కోవలో కర్ణాటకలోని హసన్ జిల్లాలో ఒక్క నెలలోనే 18 మంది గుండెపోటుతో మరణించిన దరిమిలా రాష్ట్ర ఆరోగ్య మంత్రి దినేష్ గుండు రావు ఈ మరణాలపై దర్యాప్తు చేప్పటాలని వైద్యాధికారులను ఆదేశించారు. కర్ణాటకలోని హసన్ జిల్లాలో ఒక్క నెలలో 18 మంది గుండెపోటుతో మరణించగా, వారిలో యువకులే అత్యధికంగా ఉన్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి దినేష్ గుండు రావు ఈ విధమైన గుండెపోటు కేసుల పెరుగుదలను నివారించేందుకు వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారిక దర్యాప్తు జరుగుతోందని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ ఆందోళనకర పరిస్థితుల వెనుకగల కారణాలను తెలుసుకునేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

హసన్ జిల్లాలో చోటుచేసుకున్న గుండెపోటు మరణాలపై జయదేవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్కులర్ సైన్సెస్‌కు చెందిన డాక్టర్ సి.ఎన్. రవీంద్ర నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం అధ్యయనం చేసి, నివేదికను పది రోజుల్లోగా అందజేయనుంది. హసన్‌లో ఇటీవలి కాలంలో 20 నుంచి 30 ఏళ్లలోపు వయసుకలిగిన యువకులు గుండెపోటులో మృతిచెందడం గమనార్హం. జంక్ ఫుడ్, ఆల్కహాల్, ధూమపానం, అధిక ఒత్తిడిని కలిగించే జీవనశైలి మొదలైనవి గుండెపోటుకు ప్రధాన కారణాలని ఆరోగ్య శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

## నేషనల్ స్పోర్ట్స్ పాలసీకి గ్రీన్‌సిగ్నల్



**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. జాతీయ క్రీడా విధానానికి కేంద్ర మంత్రి వర్గం పచ్చ జెండా ఊపింది. దేశంలోని క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టిసారించిన కేంద్రం.. కొత్త క్రీడా విధానానికి ఆమోదం తెలిపింది. ఉపాధి లింక్డ్ ప్రోత్సాహక పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉత్పాదక రంగంలో ఉద్యోగకల్పన ప్రోత్సహించేందుకు కొత్త పథకం తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 99,446 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది. ఆగస్టు 1, 2025 నుంచి జూలై 31, 2027 వరకు సృష్టించే కొత్త ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుంది. కొత్తగా ఉద్యోగం కల్పిస్తే 15 వేల రూపాయల ప్రోత్సాహం ఇవ్వనుంది. ఈపీఎఫ్ రెండు వాయిదాలలో కేంద్ర ప్రభుత్వం చెల్లించనుంది. లక్ష రూపాయల లోపు జీతం వచ్చే ఉద్యోగులకు వర్తించనుంది. కొత్తగా ఉద్యోగం ఇచ్చిన కంపెనీలకు ప్రతినెల 3 వేల రూపాయల చొప్పున రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వం చెల్లించనుంది. పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కోసం లక్ష కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది. ఆర్అండ్‌డి రంగంలో ప్రైవేట్ రంగం పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ లేదంటే.. 0 వడ్డీరేట్లతో దీర్ఘకాలిక ఫైనాన్స్‌న ప్రభుత్వం ఇవ్వనుంది. తమిళనాడు పారమాకుడిరామంతపురం సెక్షన్ మధ్య నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 1,853 కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది.

### వార్ 2 సెట్స్‌లో డ్యాన్స్‌తో

## దుమ్ము లేపబోతున్న స్టార్ హీరోలు!



ఇండియన్ సినిమాను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యష్ రాజ్ ఫిలిమ్స్, బాలీవుడ్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ సిద్ధమవుతున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ , గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కలయికలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ "వార్ 2" ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. వార్ 2లో యాక్షన్ ఒక్కటే కాదు... ఎనర్జీ పరంగా దుమ్ములేపే డాన్స్ నెంబరు కూడా ఉండబోతోంది. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో అత్యుత్తమ డ్యాన్సర్లు అని పేరొందిన ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరు కలిసి ఒకే స్క్రీన్‌పై స్టెప్పులేస్తే, అది రొటీన్ సాంగ్ మాదిరిగా కాకుండా డైనమిక్ మ్యూజికల్ ట్రీట్‌గా ఉంటుందని అంటున్నారు. ఇటీవల యష్ రాజ్ స్టూడియోస్‌లో ఈ సాంగ్ కోసం ఇద్దరు హీరోలు రిహార్సల్స్ చేయగా, ఈ రోజు నుంచే షూటింగ్ ప్రారంభమైంది. ఈ డాన్స్ నంబర్‌కి టాప్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ పలు రోజులు కొనసాగనుండగా, ఇందులో హైవోల్టేజ్ ఎనర్జీ, ఇంటెన్స్ స్టెప్స్ ఉండనున్నాయన్న టాక్ ఫిలింనగరంలో హీట్ పెంచుతోంది. వార్ 2ను కేవలం యాక్షన్ థ్రిల్లర్‌గా కాకుండా, అన్ని విభాగాల్లోనూ స్టాండర్డ్స్‌ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్టీఆర్ – హృతిక్ మధ్య ఫైట్స్ అన్నీ ఏకంగా హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతుండగా, ఇప్పుడు డ్యాన్స్ ఎలిమెంట్ ఈ సినిమాను మరో లెవెల్‌కి తీసుకెళ్లనుంది. ఇద్దరికి సింగిల్ టేక్ డ్యాన్సర్లు అనే పేరుంది. ఎన్టీఆర్ తన బ్లాస్టింగ్ డ్యాన్స్ మూవ్‌లతో తెలుగులో తిరుగులేని డ్యాన్సర్‌గా గుర్తింపు పొందగా, హృతిక్ రోషన్ బాలీవుడ్‌లో తన స్టైలిష్ స్టెప్స్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. అలాంటి స్టార్లను ఒకే పాటలో చూడడం అంటే, అభిమానులకే కాదు , ప్రేక్షకులందరికీ అది జీవితాంతం మరిచిపోలేని విజువల్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. డ్యాన్స్ సీక్వెన్స్‌తో పాటు పవర్‌ప్యాక్డ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్న ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ "దేవర", హృతిక్ "ఫైటర్" తర్వాత వీరిద్దరు కలిసి వార్ 2 చిత్రం చేస్తున్నారు. ఆగస్ట్‌లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.



## దీపావళికి కె-ర్యాంప్

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కె–ర్యాంప్' ఈ దీపావళికి థియేటర్స్‌లో సందడి చేయనుంది. ఈ చిత్రంలో యుక్తి తరేజా హీరోయిన్ గా నటిస్తున్నారు. జైన్స్ నాని దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ పతాకాలపై రాజేష్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. కాగా సోమవారం 'కె–ర్యాంప్' సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, ఈ చిత్రాన్ని ఈ దీపావళికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ''కిరణ్ అబ్బవరం కెరీర్‌లో 'కె–ర్యాంప్' చిత్రం మరో ఫ్రెష్ అటెంప్ట్ అవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ–నిర్మాత:జి. బాలాజీ.

### పవన్ కళ్యాణ్ సినిమా సెట్‌లో

## ప్రత్యక్షమైన చిరు..



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక వైపు సినిమాలు, మరోవైపు రాజకీయాలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం పవన్ చేస్తున్న ఈ సినిమాలు ఎప్పుడో విడుదల కావాలి. కాని ఆయన రాజకీయ పనుల వలన డిలే అవుతూ వచ్చాయి. ఇప్పటికే హరి హర వీరమల్లు చిత్ర షూటింగ్ పూర్తి చేయగా, ఈ మూవీని జూలై 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇక పవన్ నటిస్తున్న మరో చిత్రం ఓజీ షూటింగ్ కూడా పూర్తైందని తెలుస్తుంది. సుజీత్ దర్శకత్వంలో యాక్షన్ డ్రామాగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. సెప్టెంబర్‌లో మూవీ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. ఇక పవన్ ఖాతాలో ఉన్న మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నట్టు సమాచారం. పలు కీలక సన్నివేశాలను పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కిస్తున్నాడు హరీశ్ శంకర్. అయితే ఈ మూవీ సెట్‌కి మెగాస్టార్ చిరంజీవి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం రోజు ఉస్తాద్ భగత్ సింగ్ సెట్‌లో అడుగుపెట్టిన చిరంజీవి చిత్రీకరణను దగ్గరుండి వీక్షించారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో బయటకు వచ్చింది. ఇందులో చిరు షూటింగ్ సీన్‌ను చూస్తుండగా, పవన్ కళ్యాణ్ పక్కనే ఉండడం మనం చూడవచ్చు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా బ్రదర్స్ ఇద్దరు చాలా రోజుల తర్వాత కలిసి కనిపించడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు. ఇక ఈ చిత్రంలో రియల్ లైఫ్ సీన్‌ని హరీష్ ప్లాన్ చేసినట్టు సమాచారం.

పవన్ కల్యాణ్ ఆ మధ్య ఓ సందర్భంలో కారు రూఫ్ పై కూర్చొని ప్రయాణించడం మనం చూశాం. ఆయన కారు టాప్‌పై కూర్చొని వెళుతుండగా, కారుకు ఇరువైపులా సెక్యూరిటీ, వెనకాల బైకులపై అభిమానులు వెళ్లారు. ఈ వీడియో అప్పట్లో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. ఇప్పుడు ఈ సీన్‌ని రీ క్రియేట్ చేసి సినిమాలో పెట్టనున్నాడట హరీష్ శంకర్. ఒకవేళ ఈ సీన్ సినిమాలో ఉంటే, థియేటర్లలో ఫుల్ విజిల్స్ పడడం పక్కా అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది. ఈ సినిమాకు దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సాక్షి వైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## ధనుష్ రూ. 20 కోట్లు డిమాండ్..

### విషయం తెలిసి బాధేసింది: వెట్రిమారన్



నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాబినేషన్‌లో వడచైన్నై అనే చిత్రం విడుదలై మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి నిర్మాత కూడా ధనుష్ కావడం విశేషం. కాగా దానికి సీక్వెల్ ఉంటుందని గతంలోనే ప్రకటించారు. ఇటీవల ఓ సినిమా వేడుకలో వడచైన్నై– 2 చిత్రం గురించి అభిమానులు అడిగిన ప్రశ్నకు వచ్చే ఏడాది ఆ చిత్రం ఉంటుందని ధనుష్ బదులిచ్చారు. కాగా ప్రస్తుతం దర్శకుడు వెట్రిమారన్ ఉత్తర చైన్నై నేపథ్యంలో నటుడు శింబు కథానాయకుడిగా చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నారు. దీనికి సంబంధించిన ప్రకటనతో కూడిన ఒక వీడియోను ఇటీవల విడుదల చేశారు. దీంతో నటుడు ధనుష్ నటించాల్సిన వడచైన్నై– 2లో శింబు నటిస్తున్నారనే ప్రచారం హోరెత్తుతోంది. అంతే కాకుండా వడచైన్నై– 2 చిత్ర కాపీ రైట్స్ కోసం నటుడు ధనుష్ రూ.20 కోట్లు డిమాండ్ చేసినట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీంతో దర్శకుడు వెట్రిమారన్ ఈ వ్యవహారంపై స్పందించాల్సిన పరిస్థితి. ఆయన వివరణ ఇస్తూ ప్రస్తుతం జరుగుతున్న చర్చ గురించి తానూ గమనిస్తున్నానని, అయితే శింబు హీరోగా తెరకెక్కిస్తున్న చిత్రం వడచైన్నై 2 కాదనీ, ఉత్తర చైన్నై నేపథ్యంలో సాగే మరో కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. అయితే వడచైన్నై చిత్రంలోని పాత్రల ఛాయలుగానీ కొనసాగింపులు గానీ ఉంటే ఈ చిత్ర నిర్మాత (ధనుష్)తో తాము మాట్లాడుకుని అనుమతి పొందుతామని చెప్పారు. ఇకపోతే నటుడు ధనుష్ కాపీరైట్ రూ.20 కోట్లు అడిగారన్న ప్రచారంలో నిజం లేదని చెప్పారు. ఈ విషయమై ధనుష్‌తో చర్చించానని, ఆయన సార్ మీకు ఏది కరెక్టో అది చేయండి, తాము తమ సైడ్ నుంచి నో అబ్జెక్స్ పత్రం ఇస్తాం అని చెప్పారన్నారు. అంతే కానీ డబ్బు ఏమీ వద్దు అని ఆయన చెప్పారన్నారు. అలాంటిది ప్రస్తుతం జరుగుతున్న వదంతులు బాధిస్తున్నాయని దర్శకుడు వెట్రిమారన్ ఆవేదన వ్యక్తం చేశారు.



## కొత్తపల్లిలో ఒకప్పుడు!

'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' వంటి సినిమాలను నిర్మించిన నటి–నిర్మాత ప్రవీణ పరుచూరి 'కొత్తపల్లిలో ఒకప్పడు..' అనే సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 'కేరాఫ్ కంచరపాలెం' సినిమాను నిర్మించిన రానా, ప్రవీణ కలిసి మళ్లీ 'కొత్తపల్లిలో ఒకప్పడు..' చిత్రం నిర్మిస్తున్నారు. "ఓ ఘటన తర్వాత ఊహించని మలుపు తిరిగిన ఓ గ్రామీణ యువకుడి జీవితం నేపథ్యంతో ఈ సినిమా కథనం ఉంటుంది. తెలుగు సినిమాకు ఒక లవ్‌లెటర్‌లాంటిది ఈ చిత్రం. నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం"అని యూనిట్ పేర్కొంది.

## పేరు మార్చుకున్న మీనాక్షి చౌదరీ..

## నీకింకో పేరే దొరకలేదా తల్లి..!

ఈ మధ్య కాలంలో మీనాక్షి చౌదరీ పేరు మామూలుగా వినిపించడం లేదు. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ సంపాదించుకుంది. అసలు ఆమె పట్టిందల్లా బంగారమే అయిపోయింది. మరీ ముఖ్యంగా గతేడాది నుంచి ఈ అమ్మడి సుడి మాములుగా లేదు. దక్షిణాది ఇండస్ట్రీలకు లక్కీ ఛార్మ్ అయిపోయింది. ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరి దశ ఎలా తిరుగుతుందో ఎవ్వరూ ఊహించరు. నిజానికి చాలా మంది అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చి ఊహించని రేంజ్‌లో స్టార్‌డమ్ సంపాదించుకుంటారు. అలాంటి వాళ్లలో మీనాక్షి చౌదరీ కూడా ఉంటుంది. ఈ బ్యూటీ ఇండస్ట్రీలోకి వచ్చి పట్టుమని ఐదారేళ్లు కాలేదు కానీ.. ఇండస్ట్రీలో మాత్రం తిరుగులేని స్టార్ డమ్ సంపాదించుకుంది. ఇక ఇదిలా ఉంటే.. తాజాగా ఈ బ్యూటీ పేరు మార్చుకుంది. పేరంటే పూర్తి పేరు కాదు కానీ.. పేరులో ఒక లెటర్ కొత్తగా యాడ్ చేసుకుందన్న వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంగ్లీష్‌లో మీనాక్షి ఉండగా.. ఇప్పుడు కొత్తగా 'A' యాడ్ చేసుకుంది. ఇప్పుడు ఆమె పేరు మీనాక్షిగా మారిపోయింది.

ఇప్పటికే ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ స్టార్లలో ఒకరిగా ఉన్న మీనాక్షి చౌదరీ.. తన కెరీర్ గ్రోత్ కోసం ఈ మార్పు గురించి ఆలోచిస్తుందేమో అని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ప్రస్తుతానికి ఇవన్నీ ఊహాగానాలే.అక్కినేని సుశాంత్ హీరోగా నటించిన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి చౌదరీ. ఆ తర్వాత రవితేజతో కలిసి 'ఖిలాడీ' సినిమాలో నటించింది. కాగా, ఈ రెండు డిజాస్టర్‌లు అయిపోయాయి. అయితే ఆ తర్వాత రిలీజైన హిట్ మాత్రం సాలిడ్ హిట్టు కొట్టింది. ఆ తర్వాత 'గుంటూరు కారం', 'గోట్' ఇలా స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. గతేడాది రిలీజైన లక్కీ భాస్కర్ సినిమా మాత్రం మాములుగా హిట్టు కాలేదు. హిట్టు సంగతి అటుంచితే.. మీనాక్షికి మాత్రం తిరుగులేని స్టార్ డమ్ తెచ్చిపెట్టింది. సుమతి పాత్రలో ఒదిగిపోయింది. నిజానికి ఈ సినిమా సక్సెస్‌లో సగం క్రెడిట్ మీనాక్షీ చౌదరికి ఇవ్వాలి.

ఇక ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అరివీర భయంకర హిట్టు కొట్టింది. మొత్తానికి ఈ నాలుగు నెలల్లో వరుసగా మూడు బంపర్ హిట్లు కొట్టింది. లక్కీ భాస్కర్ రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. విజయ్ థలపతి గోట్ సినిమా యావరేజ్ టాక్‌తోనే రూ.450 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఇక సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏకంగా రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఇలా కేవలం 4 నెలల గ్యాప్‌లోనే రూ.850 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించిన హీరోయిన్‌గా రికార్డు సృష్టించింది. ఇక ఈ బ్యూటీ అక్కినేని వారసుడు సుశాంత్‌తో డేటింగ్‌లో ఉన్నట్లు, త్వరలో పెళ్లి కూడా చేసుకోబోతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని, వాళ్లు బెస్ట్ ఫ్రెండ్స్ అని స్వయంగా మీనాక్షీనే తెలిపింది.

ప్రస్తుతం.. మీనాక్షి చౌదరీ లైనప్‌లో రెండు సినిమాలున్నాయి. అందులో నాగ చైతన్యతో కలిసి 'NC24' సినిమా చేస్తుంది. ఈ సినిమాకు విరూపాక్ష దర్శకుడు కార్తీక్ దండూ రూపొందిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కాబోతుంది. దీనితో పాటుగా.. నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న అనగనగా ఒకరాజు సినిమాలో నటిస్తుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com